# నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

## నిజామాబాద్-కామారెడ్డి

శనివారం | జనవరి 18, 2025 | www.navatelangana.com


## స.హ చట్టం 2005 క్యాలెండర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-కామారెడ్డి**

సహ చట్టం 2005 నూతన సంవత్సర కాలమానిని కామారెడ్డి జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఆర్.రాజారాం శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాచార హక్కు చట్టం 2005 కామారెడ్డి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయంలో 100 శాతం అమలవుతుందన్నారు. సమాచార హక్కు చట్టం 2005 ప్రజలలో తీసుకెళ్లి అవగాహన కార్యక్రమాలు చేస్తూ ప్రజలను జాగృతం చేస్తున్న సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, రాష్ట్ర అధ్యక్షులు ఎం.రాజన్న, ప్రతినిధులు అందరినీ ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, రాష్ట్ర అధ్యక్షులు ఎం.రాజన్న, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు శివపూజ లింబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంపీ భాస్కర్, జోనల్ అధ్యక్షులు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్, అడ్వకేట్ ఇక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సామగ్రి సరఫరా చేసేందుకు టెండర్ల ఆహ్వానం

**నవతెలంగాణ-కామారెడ్డి**

కామారెడ్డి జిల్లాలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలు 2025 నిమిత్తం గ్రామ పంచాయతీలకు జరగబోవు ఎన్నికలకు అవసరమగు సామగ్రిని సరఫరా చేసేందుకు అనుభవం కలిగిన సంస్థల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు చైర్మన్ డి.పి.సి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ దరఖాస్తు ఫారాలను ఈ నెల 18 నుంచి 24వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంలో పొందాలని సూచించారు. టెండరు దాఖలుకు ఈ నెల 24 మధ్యాహ్నం 3 గంటల వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం జిల్లా పంచాయతీ అధికారి నెంబర్‌ను 7306245710ను సంప్రదించాలని తెలిపారు.

### జిల్లా వైద్యాధికారి పేరుతో

# డబ్బులు వసూలు

- వెంబడించి పట్టుకున్న ఆర్ఎంపీ, పీఎంపీలు
- పోలీసులకు అప్పగింత..
- కేసు నమోదు



నకిలీ వైద్యాధికారి




నకిలీ వైద్యుడి ఫేక్ ఐడీ

**నవతెలంగాణ-లింగంపేట్**

జిల్లా వైద్యాధికారి పేరు చెప్పుకొని తనిఖీ చేసి మండల కేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీ ప్రథమ చికిత్స కేంద్రాల్లో నిర్వాహకుల వద్ద డబ్బులు వసూలు చేసిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లింగాపూర్ గ్రామంలో పల్లె దావఖానాలో విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ అనే వ్యక్తి శుక్రవారం లింగంపేట్ గ్రామంలోని ప్రయివేటు వైద్యులు రషీద్, ముబీన్‌ల వద్ద నుంచి డబ్బులు వసూలు చేశాడు. ముందుగా రషీద్ అనే ప్రైవేటు వైద్యుని వద్దకు వెళ్లి.. 'కారులో జిల్లా వైద్య అధికారి ఉన్నారు. మీపై జిల్లా అధికారి వద్దకు ఫిర్యాదులు వచ్చాయి. సార్ కారులో నుంచి దిగివస్తే మీ ఆసుపత్రి సీజ్ అవుతుంది. నేను సార్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాను.' అని నమ్మబలికాడు. దీంతో రషీద్ అనే ప్రైవేటు వైద్యుడు భయంతో భయాందోళనకు గురై రూ.15 వేలు ఇచ్చారు. అనంతరం బస్టాండ్ ప్రాంతంలోని ముబీన్ అనే ప్రైవేటు వైద్యుని వద్దకు వెళ్లి 'జిల్లా వైద్యాధికారి హోటల్లో ఉన్నాడు. మీపై ఫిర్యాదులు వచ్చాయి. మీ ఆసుపత్రికి వచ్చి తనిఖీ చేసి సీజ్ చేస్తారు.' అని ప్రవేటు వైద్యుడిని దబాయించారు. దీంతో ప్రైవేటు వైద్యుడి వద్ద రూ.10 వేలు తీసుకు న్నాడు. ఈ విషయాన్ని మెడికల్‌లో ఉన్న వ్యక్తులు గమనించారు. అనుమానం వచ్చి బాలకృష్ణను వెంబడించారు. జిల్లా వైద్యాధికారి ఎక్కడా లేకపోవడంతో ప్రవేట్ వైద్యులు, మెడికల్ నిర్వాహకులు అతడిని వెంబడించి పట్టుకున్నారు. స్థానిక పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా.. గత 15 రోజుల క్రితం సదరు వ్యక్తి లింగంపేట్ మండల కేంద్రంలో మల్లేష్ అనే వైద్యుని వద్దకు వచ్చి బెదిరించి రూ.15వేలు తీసుకెళ్లినట్టు సమా చారం. జిల్లా వైద్యాధికారి పేరుపై తనిఖీ చేసి వసూళ్లకు పాల్పడిన వ్యక్తిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ వైద్యులు లింగంపేట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అదేవిధంగా సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేయనున్న ట్టు తెలిపారు. ఈ విషయమై లింగంపేట్ ఎస్సై సుధాకర్‌ను వివరణ కోరగా.. విచారణ చేపట్టి కేసు నమోదు చేస్తున్నామని ఆయన అన్నారు.

# గుప్త నిధుల కోసం క్షుద్రపూజలు



**నవతెలంగాణ-లింగంపేట్**

గుప్త నిధుల కోసం గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్రపూజలు చేయడంతో పాటు తవ్వకాలు చేపట్టడం కలకలం రేపింది. మండలంలోని కోమటిపల్లి, కేశోపేట గ్రామాల పరిసర ప్రాంతాల్లో గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధుల కోసం గురువారం రాత్రి తవ్వకాలు చేపట్టారు. అక్కడే క్షుద్ర పూజలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ సుధాకర్ గ్రామానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. భయభ్రాంతులకు గురికావొద్దని, అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం అందించాలని ఆయన గ్రామస్తులకు సూచించారు. గ్రామాల్లో గస్తీదళాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

# వ్యవసాయ యోగ్యంకాని భూములను పక్కాగా గుర్తించాలి

- జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

**నవతెలంగాణ-బాల్కొండ**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను ఈనెల 26వ తేదీన ప్రారంభించాలన్న రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బాల్కొండ మండల పరిధిలో జరుగుతున్న సర్వేలను పర్యవేక్షిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. ఈ సర్వేల పర్యవేక్షణలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామంలో జరుగుతున్న రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వేలను ఆయన పరిశీలించారు. రైతు భరోసాకు సంబంధించి భూముల వివరాలను రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ యోగ్యం కాని భూములను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి గుర్తించాలన్నారు. అదేవిధంగా రేషన్ కార్డుల మంజూరుకు రూపొందించిన జాబితా గ్రామపంచాయతీలోని కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి లబ్ధిదారుల కుటుంబ, ఆదాయ వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. ప్రత్యేక బృందాలు నమోదు చేసిన వివరాలను మండల అధికారులు పరీక్షించాలని తెలిపారు. ఈ సర్వేలను ఈనెల 20 వరకు ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు గురించి ప్రతి గ్రామంలో సర్వే కొనసాగుతుందని వివరించారు. అన్ని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముసాయిదా జాబితా తయారీ, డాటా ఎంట్రీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం గ్రామసభలలో మండల తహసీల్దార్, ఎంపీడీవో, మండల స్పెషల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రభుత్వ ఆదేశానుసారం ఈనెల 26వ తేదీ పథకాలను ప్రారంభిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, మండల ప్రత్యేక అధికారిని షేక్ రసూల్ బి, తహశీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ గంగామోహన్, ఏడీఏ భీంగల్ శ్రీనివాస్, ఏఓ లావణ్య ఇరిగేషన్ ఏఈ లింబాద్రి, ఏపీవో ఇందిరా, ఏఈవో రేష్మ మాజీ సర్పంచ్ కల్పనా అనిల్, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండెటి మోహన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ జక్కా నర్సారెడ్డి, నాయకులు గడ్డం గంగారెడ్డి, అచ్చుల్ మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గందరగోళంగా కలెక్టర్ పర్యటన

జిల్లా కలెక్టర్ మండల పరిధిలో పర్యటనకు వస్తున్నారంటే అధికారులు అప్రమత్తమవుతారు. అందుకు అనుగుణంగా తగిన ఏర్పాట్లు చేస్తారు. ఆకస్మిక తనిఖీల సమయంలో ఎక్కడికి వెళ్లాలని సిబ్బందికి తెలియనప్పటికీ మండల స్థాయి అధికారులకు కొంత సమాచారం ఉంటుంది. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు శుక్రవారం నాటి పర్యటన అందుకు భిన్నంగా సాగింది. కొందరు అధికారుల తప్పిదాల కారణంగా అయోమయం నెలకొంది. కలెక్టర్ ముందుగా మండల పరిధిలోని జలాల్‌పూర్ గ్రామంలో కొనసాగుతున్న సర్వేను పరిశీలించడానికి వస్తున్నారని సమాచారంతో పాత జలాల్‌పూర్‌లోని వ్యవసాయ యోగ్యం కానీ భూముల వద్దకు ముందుగా అక్కడికి రెవెన్యూ, వ్యవసాయ అధికారులు వెళ్లారు. ఈ క్రమంలో కలెక్టర్ ముందుగా ముప్కాల్ మండలంలో పర్యటించి వెనుతిరిగి నేరుగా కిసాన్‌నగర్ గ్రామం మీద నుంచి అక్కడికి వస్తారని భావించిన వారికి, కలెక్టర్‌తో మండల పరిషత్ అధికారులు వారిని నేరుగా తీసుకురాకుండా ఇత్వార్‌పేట్ జలాల్‌పూర్ గ్రామాల మధ్య రంగనాథ స్వామి ఆలయం రహదారి మీదుగా అక్కడికి తీసుకుని వచ్చారు. అనంతరం మళ్లీ జలాల్‌పూర్ గ్రామంలోకి వెళ్లారు. దీంతో వివిధ శాఖల అధికారుల సమన్వయ లోపంతో కలెక్టర్ పర్యటన దాదాపు అరగంటసేపు గందరగోళం నెలకొంది.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న సిబ్బంది సౌందర్య

**నవతెలంగాణ-భిక్కనూర్**

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మహిళా సాధికారత కేంద్ర సిబ్బంది సౌందర్య తెలిపారు. శుక్రవారం మండలంలోని అంగన్వాడి కేంద్రాలలో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత, పేరు ప్రఖ్యాతలు తెచ్చుకునే విధంగా మహిళకు తనకంటూ ఒక ఉపాధి కల్పించుకునే విధంగా ఎదగాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మహిళలు ముఖ్యంగా మగ్గం, బ్యూటీషియన్, టైలరింగ్ కోర్సులు ఉచితంగా నేర్చుకునే అవకాశం ఉందని, ఆహార పదార్థాల తయారీ చేసే పద్ధతులు వివరించారు. ప్రభుత్వ హెల్ప్ లైన్ సదుపాయాల్లో సఖి సర్వీసెస్ 181 హెల్ప్‌లైన్ నెంబర్ సదుపాయం, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, చిల్డ్రన్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098 సదుపాయాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## వైన్స్ ఆకస్మిక తనిఖీ చేసిన ఎక్సైజ్ శాఖ



వైన్స్‌ను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్‌శాఖ అధికారులు

**నవతెలంగాణ-భిక్కనూర్**

ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో భిక్కనూర్, పెద్దమల్లారెడ్డి గ్రామాలలో గల వైన్స్‌లను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు వైన్స్‌లోని మద్యం బాటిళ్లు, స్టాక్ రిపోర్ట్, రిజిస్టర్‌లను పరిశీలించారు. మద్యం బాటిల్‌పై స్టిక్కర్లు, మద్యం బాటిళ్లను పరిశీలించి నకిలీ మద్యం విక్రయిస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఎక్సైజ్ ఎస్సై దీపిక, హెడ్ కానిస్టేబుల్ మొయినుద్దీన్, కానిస్టేబుల్ శరత్, మహేష్, సిబ్బంది ఉన్నారు.

## బడి బయట పిల్లల గుర్తింపు

**నవతెలంగాణ-లింగంపేట్**

మండలంలోని ఆయా గ్రామాలలో శుక్రవారం బడిబయట పిల్లలను గుర్తించినట్టు మండల విద్యాధికారి షౌకత్ అలీ తెలిపారు. మండలంలోని ముస్తాపూర్, శెట్పల్లి, లింగంపేట్ గ్రామాలలో ఇంటి వద్ద ఉన్న పిల్లలను గుర్తించినట్టు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించి బడిలో చేర్పించేలా చర్యలు చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. సంక్రాంతి సెలవుల అనంతరం బడి బయట పిల్లలను బడిలో చేర్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గంగాధర్, రాజు, విజయ్, సంఘగౌడ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# 21న ఆశావర్కర్ల పాదయాత్ర

- జయప్రదం చేయండి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్



వినతిపత్రాన్ని అందజేస్తున్న నూర్జహాన్, ఆశా కార్యకర్తలు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

21న ఆశావర్కర్ల సమస్యలపై జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ తెలిపారు. శుక్రవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఏవోకు ఆశావర్కర్ల సమస్యలపై జరిగే జనవరి 21న మహా పాదయాత్ర గురించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. జనవరి 21న ఆశావర్కర్ల సమస్యలపై జరిగే మహాపాదయాత్రను జయప్రదం చేయాలని ఆమె అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని తెలిపారు. బీఆర్ఎస్ కంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తుందని, ఆశాలకు వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిందని తెలిపారు. ఆశాల ఓట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, కానీ ఆశాల సమస్యలు మాత్రం నేటికీ పరిష్కారం చేయలేదని తెలిపారు. ఈ కాలంలో ఆశాలకు ఫిక్స్డ్ వేతనం రూ.18,000లు నిర్ణయం చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా ఉన్నతాధికారులకు, జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఆశాలు అనేకసార్లు వినతిపత్రాల ద్వారా విజ్ఞప్తులు చేశారని వివరించారు. ఇప్పటికీ నిరంతరం నిరసనలు, పోరాటాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. అయినా కాంగ్రెస్ ప్రభుత్వం చలనం లేనట్లు వ్యవహరిస్తున్నదన్నారు. ఈ పరిస్థితిలో ఆశాల సమస్యల పరిష్కారం కోసం జనవరి 21న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో రాజీవ్‌గాంధీ ఆడిటోరియం నుంచి కొత్త కలెక్టర్ కార్యాలయం వరకు మహాపాదయాత్ర ఉంటుందని, ఈ పాదయాత్రను ఆశావర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సుకన్య, రేణుక, గంగామణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

# లారీ ఢీకొని యువకుడు మృతి

- నష్టపరిహారం చెల్లించాలని గిరిజనుల రాస్తారోకో
- స్తంభించిన రాకపోకలు



ఆందోళన చేస్తున్న తండావాసులు



మోహన్ (ఫైల్)

**నవతెలంగాణ-లింగంపేట్**

నడుచుకుంటూ వెళ్తున్న యువకుడిని వెనుక నుంచి లారీ ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని ముస్తాపూర్ గ్రామ సమీపంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని కొయ్యగుండు తండాకు చెందిన సభావత్ మోహన్ (28) అనే యువకుడు తన బర్రెలను మేతకు తీసుకెళ్లి.. ఇంటికి తోలుకుని వస్తున్న క్రమంలో కామారెడ్డి నుంచి లింగంపేట్ వైపు అతివేగంగా వెళ్తున్న లారీ ఢీకొంది. ఈ క్రమంలో మోహన్ లారీ కిందే ఇరుక్కుపోయాడు. స్థానికులు, ఎస్సై సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా శ్రమించి జెసిబి సహాయంతో యువకుడిని బయటకు తీశారు. వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. కాగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఇంటికి పెద్ద కొడుకైన మోహన్ చెల్లె పెళ్లి చేయాలని ఎన్నో ఆశలు పెట్టుకుని కష్టపడుతున్నాడు. ఇంటికి పెద్దకొడుకు కోల్పోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



అదుపుతప్పి ప్రమాదానికి కారణమైన లారీ

**నష్టపరిహారం చెల్లించాలని గిరిజనుల రాస్తారోకో..**

డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా లారీ నడపడంతోనే యువకుడు మృతి చెందాడని డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతుడి బంధువులు, తండావాసులు శుక్రవారం తాండ సమీపంలోని ఎల్లారెడ్డి కామారెడ్డి ప్రధాన రహదారిపై గంటపాటు రాస్తారోకో నిర్వహించారు. మృతుని కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం ఇచ్చేంతవరకు విరమించే ప్రసక్తి లేదని గిరిజనులు తేల్చి చెప్పారు. శుక్రవారం సంత కావడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. దీంతో సంతకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. లింగంపేట్ ఎస్సై సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకొని రాస్తారోకో నిర్వహిస్తున్న గిరిజనులతో మాట్లాడారు. లారీ యజమానితో మాట్లాడి నష్టపరిహారం అందించేలా చూస్తామని హామీనివ్వడంతో గిరిజనులు రాస్తారోకోను విరమించారు.

## వ్యవసాయేతర భూములను గుర్తించండి

- రైతు భరోసా సర్వే పకడ్బందీగా నిర్వహించాలి
- జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్



సర్వేను ఆరాతీస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

**నవతెలంగాణ-లింగంపేట్**

గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి భూములను గుర్తించాలని జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ అధికారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో చేపడుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వేలో తప్పులు లేకుండా చూడాలన్నారు. సర్వే ఎలా చేయాలో అధికారులకు వివరించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభలు ఏర్పాటు చేసి లబ్ధిదారులను గుర్తిస్తామన్నారు. 16 నుంచి 26వ తేదీవరకు రైతు భరోసా సర్వే చేపట్టనున్నట్టు వివరించారు. గూగుల్ మ్యాప్ ద్వారా వ్యవసాయ, రెవెన్యూ సిబ్బందికి సూచించిన సర్వేనెంబర్ల ప్రకారం క్షేత్ర సహాయకులు వెళ్లి పరిశీలించాలన్నారు. ఆ భూముల్లో వెంచర్లు, కట్టడాలు, కోళ్ల ఫారం, భవన నిర్మాణాలతో పాటు తదితర వ్యవసాయానికి ఉపయోగపడకుండా ఉన్న వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలని ఆయన సూచించారు. ఈనెల 16 నుంచి 26వ తేదీ వరకు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తామని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ నరేందర్, వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సంగమేశ్వర్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ప్రశాంత్, రెవెన్యూ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం



**నవతెలంగాణ-కామారెడ్డి**

కామారెడ్డి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కామారెడ్డి కార్యాలయంలో శుక్రవారం తొలిసారి సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతనంగా మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన లక్ష్మిని కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి సన్మానించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కామారెడ్డి నూతనంగా పాలకవర్గం ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియపర్చుతూ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. అనంతరం మార్కెట్ యార్డ్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు గానూ తగు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపేందుకు, మార్కెట్ తగు ఆదాయమును సమకూర్చుకొనేందుకు తగిన చర్యలు తీసుకునేందుకు పాలకవర్గం చర్చించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ధర్మగోని లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ మీనుకూరి బ్రహ్మానందరెడ్డి, కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, సభ్యులు, కార్యదర్శి నర్సింలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రం ఆకస్మిక తనిఖీ



**నవతెలంగాణ-బాల్కొండ**

మండల పరిధిలోని ఇత్వార్‌పేట్ గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని శుక్రవారం మహిళా శిశు సంక్షేమ జిల్లా అధికారిని షేక్ రసూల్‌బి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్రంలోని ఆహార పదార్థాలను పాఠశాలల్లోని పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అనంతరం అంగన్వాడి పిల్లలకు, గర్భిణీలకు అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాలపై అంగన్వాడీ టీచర్, ఆయాలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ గంగా మోహన్, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



**నవతెలంగాణ-ఆర్మూర్**

ఈనెల 12న కల్లెడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జూనియర్ బాలుర హ్యాండ్ బాల్‌ఉమ్మడి జిల్లా జట్టు ఎంపికలో పట్టణ సాంఘిక సంక్షేమ గురుకుల వివేక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక అయ్యారని ప్రిన్సిపల్ పూర్ణచందర్ శుక్రవారం తెలిపారు. ఈనెల 18 నుంచి 20 వరకు కరీంనగర్లో నిర్వహించే ఇంటర్ డిస్టిక్ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని వైస్ ప్రిన్సిపల్ సాయన్న, దయాల్ తెలిపారు. ఈ సందర్భంగా దిలీప్, ప్రేమ్, రవి, స్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు పీడి జ్ఞానేశ్వర్, పిఈటి రాజేందర్, పాఠశాల, కళాశాల బృందం, నాన్ టీచింగ్ స్టాఫ్, సూపరింటెండెంట్ లక్ష్మి, లక్ష్మణ్, వినీల్ తదితరులు అభినందించారు,

# సంక్షేమ పథకాలకు అర్హులనే ఎంపిక చేయాలి

- జిల్లా అదనపు (స్థానిక సంస్థల) కలెక్టర్ అంకిత్

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**



మోపాల్: సర్వే నిర్వహిస్తున్న అధికారులు



భీంగల్ రూరల్‌లో...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు అర్హులైన లబ్ధిదారులను మాత్రమే ఎంపిక చేయాలని జిల్లా అదనపు( స్థానిక సంస్థలు) కలెక్టర్ అంకిత్ అన్నారు. శుక్రవారం వేల్పూర్ మండలంలోని లక్కోర గ్రామంలో రైతు భరోసా, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులు ఎంపిక కోసం కొనసాగు తున్న సర్వేను ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. లబ్ధిదారుల సమగ్ర వివరాలు సేకరించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఈనెల 20 వరకు నిర్వహించిన సర్వే ఆధారంగా లబ్ధిదారుల జాబితా సిద్ధం చేసి, అనంతరం జరిగే గ్రామసభల్లో ఆమోదింపజేసి ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, తదితరులు ఉన్నారు.

**మోపాల్** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి సమగ్ర వివరాలను సేకరించాలని ఎంపీడీవో రాములు నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని సింగంపల్లి, బాడ్సి, కస్బాగ్ తాండ, నర్సింగ్‌పల్లి, తనకుర్దు తదితర గ్రామాలలో ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన లబ్ధిదారులు గుర్తించే తీరు, అంశాలను పరిగణ లోకి తీసుకుంటున్నారు. సేకరించిన అంశాలను రిజిస్టర్లు నమోదు చేయాలని సూచించారు. అలాగే ఫీల్డ్ వెరిఫికేషన్ వేగవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఆధార్ కార్డు ప్రజాపాలన దరఖాస్తులు, సామాజిక, ఆర్థిక సర్వే వివరాలతో క్షేత్రస్థాయి పరిశీలన వివరాలను సరిచూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, కారోబార్ అరుణ్, తదితరులు పాల్గొన్నారు.

**భీంగల్ రూరల్** : మండలంలోని చెంగల్ గ్రామంలో ఎఫ్ఎస్‌సి ఆహార భద్రత కార్డు సర్వే, రైతు భరోసా సర్వేను అదనపు కలెక్టర్ అంకిత్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లాలో రైతు భరోసా, ఆహార భద్రత కార్డులపై సర్వే కొనసాగుతుందని అన్నారు. రైతు భరోసా పథకాన్ని జనవరి 26న ప్రారంభిస్తారని, ఈ సర్వే ద్వారా అర్హులైన రైతులను గుర్తిస్తారని తెలిపారు. రైతు భరోసా పథకం కింద రైతులు, కౌలు రైతులకు ప్రభుత్వం సంవత్సరానికి ఎకరానికి రూ.12వేలు ఇస్తారని, ఎకరాలు ఉంటే, అన్ని ఎకరాలకూ ఇస్తుందని తెలిపారు. రైతులు సాగుకి యోగ్యంగా ఉన్న అన్ని భూములూ చూపించాలని, లేదంటే.. పంట ఉన్న భూములనే సర్వేలో నమోదు చేసుకుంటారన్నారు. అంతవరకే భరోసా ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఒకవేళ అధికారులు సర్వే కోసం వచ్చినప్పుడు సంబంధిత పొలాల రైతు అందుబాటులో లేకపోతే ఆయా గ్రామ సభల్లో ఆ జాబితాను ప్రకటిస్తారన్నారు. అప్పుడు మిస్సయిన రైతులు ఆ జాబితాను పరిశీలించి, ఏదైనా సమస్య ఉంటే అధికారులకు చెప్పొచ్చన్నారు. అప్పుడు పరిశీలించి సరిచేస్తారని తెలిపారు. అందువల్ల ఇవాళినుంచి 3 రోజులు రైతులు అప్రమత్తంగా ఉండి, తమ దగ్గరున్న వ్యవసాయ యోగ్యమైన పొలాలను చూపించాలన్నారు. తనిఖీ బృందాల్లో పంచాయతీ రాజ్, మండల రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాధిపతిగా సత్యనారాయణ రెడ్డి నియామకం



**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగాదిపతిగా డాక్టర్ మావురపు సత్యనారాయణ రెడ్డిని నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి యాదగిరి రావు నియామకపు ఉత్తర్వులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావు మాట్లాడుతూ డాక్టర్ సత్యనారాయణ రెడ్డి ప్రసిద్ధి చెందిన జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం న్యూ ఢిల్లీ నుండి పీహెచ్డీ కొరకు మధుమేహం వ్యాధి నివారణ పై జరిపిన పరిశోధనలు గుర్తించదగినవని పేర్కొన్నారు. పీహెచ్డీ అనంతరం అమెరికాలోని ప్రఖ్యాత రడ్ గర్స్ యూనివర్సిటీలో క్యాన్సర్ వ్యాధి నివారణకు జరిగిన పరిశోధన ఫలాలుగా పది అంతర్జాతీయ పేటెంట్లు సొంతం చేసుకోవడం యూనివర్సిటీ కి గర్వకారణమని తెలిపారు. ఈ పరిశోధనల అనుభవాన్ని తెలంగాణ యూనివర్సిటీ విద్యార్థులకు అందించి యూనివర్సిటీని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టాలని సూచించారు. ప్రస్తుతం యూనివర్సిటీ కళాశాలకు వైస్ ప్రిన్సిపల్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్ సత్యనారాయణ రెడ్డి గతంలో అడిషనల్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా, పబ్లికేషన్ సెల్, ఈక్వల్ ఆపర్చునిటీ సెల్‌లకు డైరెక్టర్ గా విధులు నిర్వహించి ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ నా మీద నమ్మకంతో విభాగాధిపతిగా నియామకపు ఉత్తర్వులు అందించిన వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ యాదగిరిరావుకు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ నియామకాన్ని పురస్కరించుకొని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, సైన్స్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ సిహెచ్ ఆరతి, డాక్టర్ వాసం చంద్రశేఖర్, డాక్టర్ బోయపాటి శిరీష, అకాడమిక్ కన్సల్టెంట్లు తదితరులు అభినందించారు.

## బిసిటియు క్యాలెండర్‌ను ఆవిష్కరించిన జిల్లా జడ్జి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

జిల్లా కోర్టు భవనం లోని కుంచాల సునితా జిల్లా ప్రధాన న్యాయమూర్తి తన చాంబర్ లో బిసి ఉపాధ్యాయ సంఘం వాల్ క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుంచాల సునితా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు అందరికీ సానిటరీ నాప్కిన్స్ అందేలా చూడాలన్నారు. తనవంతు బాధ్యతగా నాలుగు పాఠశాలల్లో అందిస్తానని, మిగతా దాతలు కూడా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో బిసి ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్, ప్రధాన కార్యదర్శి రాఘవాపురం గోపాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కొట్టాల రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు కైరంకొండ బాబు, బిసిటియు మహిళా అధ్యక్షురాలు నునుగొండ విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు అంబటి నర్సయ్య, గౌరవ సలహాదారులు రమణ స్వామి, మాక్లూర్ మండల అధ్యక్షులు గంగోనె సంజీవ్ పాల్గొన్నారు.

## 20నుంచి ఉచిత మగ్గం శిక్షణ , దరఖాస్తుల ఆహ్వానం

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డిచ్‌పల్లి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ లను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గం వర్క్. 30 రోజులు 18 నుంచి, బ్యూటీ పార్లర్ 30 రోజుల శిక్షణ ఈనెల 20 నుండి ప్రారంభమవుతుందని వివరించారు. ఉచిత శిక్షణతో పాటుగా ఉచిత భోజన సదుపాయం, హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని, శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేస్తామని తెలిపారు. 19 నుండి 40 సంవత్సరాల వయసు కలిగి ఉండి నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత యువకులు ఈ చక్కని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ సూచించారు. ఆసక్తి గల వారు శిక్షణకు వచ్చే ముందు తమ వెంట ఆధార్ కార్డ్ ,రేషన్ కార్డ్, 10 వ తరగతి ధ్రువీకరణ పత్రం , ఐదు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు తెచ్చుకొని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఏదైనా సమాచారం కోసం 08461 295428 ఫోన్ నంబర్ లలో సంప్రదించాలని తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



**నవతెలంగాణ-ముప్కాల్**

మండల కేంద్రానికి చెందిన ఆరుగురు లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ టౌన్ ఇంచార్జ్ ముస్కు మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని రెంజర్ల గ్రామంలో సైతం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మగ్గిడి ముత్యం రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డీసీసీ డెలిగేట్ ఉపాధ్యక్షుడు గడ్డం చిన్నారెడ్డి, ఏలేటి రాములు, డిష్ రవి, మయూర్, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నేడు సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

నేడు సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం ఉంటుందని, ని ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు కామ్రేడ్ పశ్య పద్మ హాజరవుతారని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ తెలిపారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు నిజామాబాద్ అంబేద్కర్ కాలనీలోగల హమాలి యూనియన్ (ఏఐటియుసి) కార్యాలయంలో ఉదయం 11 గంటలకు అమరులు కామ్రేడ్ గడ్డం వెంకట్ రెడ్డి 4వ వర్ధంతి సభ ఉంటుందని తెలిపారు. అనంతరం జిల్లా కౌన్సిల్ సమావేశం ఉంటుందని తెలిపారు. జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రజాసంఘాల ముఖ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం

- ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానంద రెడ్డి
- కమ్మర్‌పల్లిలో విస్తృతంగా వాహనాల తనిఖీలు



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానందరెడ్డి

**నవతెలంగాణ-కమ్మర్‌పల్లి**

రోడ్డు ప్రమాదాలను 50 శాతానికి తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆర్మూర్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వివేకానంద రెడ్డి అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని ఉప్లూర్ వెళ్లే దారిలో ఉన్న వరద కాలువ వద్ద విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎంవిఐ వివేకానంద రెడ్డి మాట్లాడుతూ.. జనవరి 1 నుండి 31 వరకు దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రత మాసోత్సవాలు జరుగుతున్నాయని అన్నారు. అందులో భాగంగా వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలతో పాటు అధికారులతో బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా వాహనాల తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా సరైన పత్రాలు కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు వాహన పత్రాలతోపాటు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ ధరించడంతోపాటు వాహానానికి సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉండాలన్నారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదన్నారు.

ఇతరులకు హాని కలిగే విధంగా అతివేగంతో వాహనాలు నడపొద్దని సూచించారు. ఈ సందర్భంగా ఆయన డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు బ్యాచ్ నెంబర్ కలిగి ఉండాలని, యూనిఫామ్ ధరించాలని, అనుమతికి మించి ఎక్కువ ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు. ప్రయాణికులతో కూడా మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. వాహనాల తనిఖీ సందర్భంగా సరైన పత్రాలు లేని ఐదు వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్ రెడ్డి, కే.సాగర్, ఎన్.శ్రీనివాస్, డి.పవన్ కళ్యాణ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తులసి పట్వారిని అభినందించిన కలెక్టర్



**నవతెలంగాణ-ఆర్మూర్**

జాతీయ స్థాయిలో భారత సేవ రత్న పురస్కారం అందుకున్న సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా వారిని చూసి ప్రత్యేకంగా అభినందించారు. సంఘ సేవలో ఎల్లప్పుడూ ముందుండి విద్యార్థులకు ప్రజలకు సేవ చేసి భారత్ సేవా పురస్కారం జాతీయస్థాయిలో అందుకోవడం జిల్లాకి గర్వ కారణమని ఈ సందర్భంగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. సంఘ సేవలో పట్వారీ తులసికి జాతీయస్థాయిలో గుర్తింపు రావడం జిల్లాకి గర్వకారణమని జిల్లా అధికారులు జాయింట్ కలెక్టర్ కిరణ్ కుమార్, డిఈఓ అశోక్, డిఎంహెచ్ఓ రాజశ్రీ పట్వారిని అభినందించారు. జిల్లా అధికారుల నుంచి ఎల్లప్పుడూ పట్వారి తులసి సేవలకు సహకారం ఉంటుందని అన్నారు.

## నీటి నిల్వలను తొలగించుకోవాలి

- వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలి
- జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్



రికార్డులను పరిశీలిస్తున్న మలేరియా అధికారి

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

నివాస గృహాల్లో నీటి నిల్వలను వెంట వెంటనే తొలగించుకోవాలని, వ్యాధుల బారిన పడకుండా ఎప్పటికప్పుడు చూసుకుంటూ జాగ్రత్తలు తీసుకోవాలి జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ పేర్కొన్నారు. శుక్రవారం ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం (బి) గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తుకారం రాథోడ్ ఆకస్మికంగా పరిశీలించారు. దోమల వల్ల కలిగే వ్యాధులను ప్రజలకు వివరించి దోమలు నిలువగల ప్రాంతాలను, పూల కుండీల్లో నిలువగల నీటిని పడేసిన కొబ్బరి చిప్పలలో, పాత టైర్లలో, వాడని కూలర్లలో గల నీటిని తొలగించడం జరిగిందన్నారు. గ్రామంలో నీరు నిలువగల ప్రాంతాలను గుర్తించి గ్రామ కార్యదర్శికి నివేదించారు. ఈ నీటి నిల్వలను తొందరగా తొలగించాలని, ఆయిల్ బాల్స్ వదలాలని గ్రామ కార్యదర్శికి వివరించాలని మండల విస్తరణ అధికారి వై శంకర్‌కు అదేశించారు. దోమల వల్ల కలిగే వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చిక్కున్ గున్యా లాంటి వ్యాధులను తరిమికొట్టాలని దోమ లార్వా పెరగకుండా చూడాలని, నీటి నిలువగల ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. దోమలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి పైరిత్రం స్ప్రే చేయించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు పగడ్బందీగా ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూపర్వైజర్ దేవపాలకు ఆదేశించారు. గ్రామంలో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాలలో నెలకు రెండుసార్లు సందర్శించి దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వైశంకర్ మలేరియా సభ్యుడిగా అధికారి రాజేందర్ హెల్త్ సూపర్వైజర్ దేవపాల ఆరోగ్య కార్యకర్త మహాలక్ష్మి ఆశా కార్యకర్తలు బోడికే స్వప్న తదితరులు పాల్గొన్నారు.

# పనులు నాణ్యతతో చేపట్టాలి

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- నగరంలో అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

35వ డివిజన్ శివాజీ విగ్రహం జైన్ మందిర్, 36వ డివిజన్ చత్రపతి హనుమాన్ మందిర్ వద్ద, 37వ డివిజన్ అంబేద్కర్ కాలనీ ఎస్సీ సంఘం వద్ద లో మరియు 43 వ డివిజన్ లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ నీతుకిరణ్‌తో పాల్గొని భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 14వ ఫైనాన్స్ ద్వారా ప్రతి డివిజన్ కు పదిలక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అన్నారు .అందులో భాగంగా నగరంలో పలు డివిజన్లో అభివృద్ధి కార్యక్రమాలు సీసీ రోడ్, డ్రైనేజ్ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్, డ్రైనేజీ పనులు నాణ్యతతో ఎటువంటి జాప్యం లేకుండా త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్లను, అధికారులను ఆదేశించారు. నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక నిధులు వంద కోట్లు మంజూరు చేయాలని ఇంచార్జ్ మంత్రి జూపల్లి, ముఖ్యమంత్రి రేవంత్ దృష్టికి తీసుకుపోయినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు 35 వ డివిజన్ ఎర్రం సుధీర్, 36 వ డివిజన్ మాస్టర్ శంకర్, 37 వ డివిజన్ ఉమా రాణి,ముత్యాలు, 43 వ డివిజన్ స్రవంతి రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుల సర్వేలో పాల్గొన్న నాయకులు



**నవతెలంగాణ-ఆర్మూర్**

అర్హులైన లబ్ధిదారుల రేషన్ కార్డుల సర్వేలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి 8వ వార్డు ఇందిరమ్మ కాలనీలో స్థానిక కౌన్సిలర్ మెడిదాల సంగీత రవిగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాలనలో భాగంగా కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారుల కొత్త రేషన్ కార్డుల మంజూరు ఎంపిక ప్రక్రియలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వన్నెలదేవి లావణ్య అయ్యప్ప శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షైక్ మున్నుబాయ్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ విట్టం జీవన్, మున్సిపల్ మాజి ఛైర్మెన్ పండిత్ పవన్, కౌన్సిలర్లు హన్మండ్లు, రవి గౌడ్, ఆర్మూర్, ఆలూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కెర విజయ్, చిన్న రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సునీల్ రెడ్డి, నవీన్ రెడ్డి పాల్గొన్నారు. వినయ్‌కమార్‌రెడ్డి ఇందిరమ్మ కాలనిలో వివరాలను అడిగి తెలుసుకొని, ఇందిరమ్మ కాలనీలో ఉన్న ఇండ్లు మొత్తం కూడా కాంగ్రెస్ పార్టీ హయాంలో ఇచ్చినవే అని చెప్పారు. నిజమైన పేద వారికి లబ్ది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అన్ని చెప్పారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతి లబ్ధిదారునికి రేషన్ కార్డు మంజూరి అయ్యేవిధంగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలని అధికారులు, కాంగ్రెస్ నాయకులకు తెలిపారు.. కార్యక్రమంలో కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## బోరువేయించిన సునీల్‌కుమార్

- కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు



**నవతెలంగాణ-భీంగల్ రూరల్**

మండలంలోని దేవన్ పల్లి గ్రామంలోగల మైనార్టీ కాలనీ, తాల్లకుంటలో నీటి సమస్య ఉందని ఆ గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్‌కు తెలిపారు. దీంతో ఆయన బోరు బండిని పంపించి ఆ గ్రామాలకు నీటి సమస్యలు తీర్చేందుకు ఎస్‌డిఎఫ్ నిధుల ద్వారా బోరు వేయించారు. దీంతో గ్రామస్తుల ముత్యాల సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో భీంగల్ మండల అధ్యక్షులు బొదిరె స్వామి, ఎస్టీ సెల్ అధ్యక్షులు దేవన్ పల్లి, ఇంచార్జ్ బదావత్ గోపాల్ నాయక్ జిల్లా ఎస్టీ జనరల్ సెక్రెటరీ మాలవత్ రాములు, దేవనపల్లి బీసీ అధ్యక్షులు బోండ్ల గంగాధర్, విడిసి అధ్యక్షుడు బొడ్డు చిన్న గంగారం, గ్రామ శాఖ అధ్యక్షుడు మాలావత్ రమేష్, ఎస్టి అధ్యక్షుడు దర్సింగ్, వంజరి రమేష్, మక్కల చిన్నయ్య, కుంచపు చిన్నయ్య, బుచ్చోడా మలావత్, సంతోష్ లకావత్ లాలు, సమీర్ బడేసాబ్, తదితరులు పాల్గొన్నారు.

## విలీన సభను విజయవంతం చేయండి

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

రెండు అఖిల భారత రైతు కూలీ సంఘాలు ఏఐకేఎంఎస్ విలీన సభను ఈనెల 19న మహబూబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించుచున్నామని, విలీన సభకు రైతు కూలీ సంఘం కార్యకర్తలు, రైతులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని వేల్పూర్ భూమయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ద్వారక నగర్‌లోగల ఐఎఫ్టియు కార్యాలయంలో విలేకరల సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంపై నిర్లక్ష్య వైఖరి కారణంగా వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతున్న సమయంలో దేశంలోని రెండు అఖిల భారత రైతు కూలీ సంఘాలు ఏఐకేఎంఎస్ విలీనమై రైతాంగ ఉద్యమాలను రూపొందించుకోవడానికి విలీన సభ నిర్వహించుకుంటుందని భూమయ్య అన్నారు. రైతాంగ ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం లిఖిత పూర్వకంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదని నూతన మార్కెట్ విధానాన్ని తీసుకొస్తుందని, ఎంఎస్పి మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని పార్లమెంట్లో తీసుక రాలేకపోతున్న నేపథ్యంలో పంటలకు గిట్టుబాటు ధరలు అందక రైతులు అప్పుల సంక్షోభంలో కూరుకుపోతున్నారని వారన్నారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని గత 52 రోజులుగా జగదీష్ సింగ్ దల్లేవాల ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారని తెలిపారు. ఆయన చావు బతుకుల్లో ఉన్న ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై కర్తవ్యాల్ని రూపొందించుకొని రైతు కూలీ ఉద్యమాల్ని తీవ్రత తరం చేయడానికి ఈ సభ ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శనివారం | జనవరి 18, 2025 | www.navatelangana.com

## ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

**నవతెలంగాణ-భిక్కనూర్(రాజంపేట్)**

ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రాజంపేట్ మండల మెడికల్ అధికారి విజయ మహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా హెల్త్ సూపర్వైజర్ మహమ్మద్ మంజూర్, గంగామణి గ్రామంలోని ఇంటి పరిసరాలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు, దోమలు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాగలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## పల్లె దవాఖానకు వాటర్ ప్యూరిఫైర్ వితరణ


ప్యూరిఫైర్‌ను అందజేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు

**నవతెలంగాణ-వర్ని**

మండల కేంద్రంలోని పల్లె దవాఖానకు స్థానిక ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు వాటర్ ప్యూరిఫైనీ శుక్రవారం అందజేశారు. స్థానిక వైద్యులకు, ఏఎన్ఎంలకు, ఆశాలకు, వచ్చే రోగులకు స్వచ్ఛమైన నీరు తాగడానికి వాటర్ ప్యూరీఫై అందించటం అభినందనీయమని మాజీ సర్పంచ్ కర్లం సాయరెడ్డి, ప్రయివేటు వైద్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైద్యులు సాయన్న, శ్రీనివాస్ సిందే, మాజీ వైస్ ఎంపీపీ దశగౌడ్, ఏఎంసీ డైరెక్టర్ సుధాకర్‌రావు, కుమ్మరి బాబు, జైరాం తదితరులు పాల్గొన్నారు.

# సర్వే పక్కాగా నిర్వహించాలి

- అధికారుల సూచన
- పలు గ్రామాల్లో సర్వే తనిఖీ


పిట్లం: సర్వేను పరిశీలిస్తున్న జిల్లా అసిస్టెంట్ కలెక్టర్


నాగిరెడ్డిపేట్‌లో..

**నవతెలంగాణ-విలేకరుల బృందం**

**పిట్లం :** రైతు భరోసా సర్వే విధివిధానాలు పక్కగా నిర్వహించాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బండాపల్లి, చిల్లెరిగి, ధర్మారం గ్రామాలలో నిర్వహించిన ఫీల్డ్ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీడు భూములు, గుట్టలు, వెంచర్లు, వ్యవసాయ అనుసంధానానికి యోగ్యము లేనటువంటి భూములను సర్వేలో చూయించవద్దని అధికారులకు ఆదేశించారు. కేవలం పంటలు పండిస్తున్న భూములను మాత్రమే సర్వేలో నమోదు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, ఎంపీఓ యాదగిరి, వ్యవసాయ అధికారిని కమల, ఆర్ఐ శీతల్, సర్వేయర్ చరణ్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**మద్నూర్ :** రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 జనవరి నుంచి అమలు చేసే నాలుగు పథకాలపై జరుగుతున్న అధికారుల సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి మండల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సర్వే కార్యక్రమాల్లో భాగంగా మద్నూర్ మండలంలోని లచ్చన్, అంతాపూర్ గ్రామాలను పర్యటించి అధికారులు సర్వేలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎమ్‌డీ ముజీబ్, మండల ప్రత్యేకాధికారి నాగరాజ్, ఎంపీడీవో రాణి, మండల వ్యవసాయాధికారి రాజు, ఆయాగ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

**వ్యవసాయేతర భూములు పరిశీలించిన అడిషనల్ కలెక్టర్..**

**నాగిరెడ్డిపేట్ :** మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో కొనసాగుతున్న వ్యవసాయేతర భూముల సర్వేను కామారెడ్డి జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ విక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వ్యవసాయేతర భూముల సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 1060 ఎకరాలు వ్యవసాయేతర భూమి ఉన్నట్లు గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా రేషన్ కార్డుల సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. రేషన్ కార్డులో మార్పులు చేర్పులకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ మొహమ్మద్, ఏవో సాయికిరణ్ రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

**ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా చూడాలి..**

**దోమకొండ :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందే విధంగా చూడాలని ఆర్డీవో రంగనాథ్ అన్నారు. మండలంలోని ముత్యంపేట్ గ్రామంలో రేషన్‌కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో సాగుకు యోగ్యమైన భూములను గుర్తించాలని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు అందేవిధంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో జరుగుతున్న సర్వేతీరును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంజయ్‌రావు, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ రేఖ తదితరులు పాల్గొన్నారు.

**సర్వే పకడ్బందీగా చేపట్టాలి..**

**తాడ్వాయి :** రేషన్ కార్డులు, ఆత్మీయ రైతు భరోసా సర్వేను పకడ్బందీగా చేపట్టాలని డిఎల్పీఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సంగోజివాడి గ్రామంలో చేపడుతున్న సర్వేను పరిశీలించి కుటుంబీకుల పూర్తి సమాచారం తెలుసుకొని గతంలో ఉన్న రేషన్ కార్డులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హులైన పేదల కుటుంబాలకు రేషన్ కార్డులు అందేలా చూడాలని, ఈ సర్వే నిక్కచ్చిగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీఓ సవితరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాలు, తదితరులున్నారు.

**కొనసాగుతున్న రైతు భరోసా సర్వే..**

మండల కేంద్రంలో పంటలకు యోగ్యంగా లేని భూములను సర్వే చేస్తున్నట్లు ఏఈఓ శ్రావణ్ కుమార్ తెలిపారు. గ్రామ సమీపంలోని గుట్టల కింద పంటలకు అనుకూలంగా లేని పెద్దగుట్ట కింద ఉన్న భూములు సాగుచేయడం లేదని గుర్తించామని ఎత్తయిన గుట్టలుగా ఉండి పంటలకు అనుకూలంగా లేని 19, 107 తదితర సర్వే నెంబర్లు గల భూములు పంటలకు యోగ్యంగా లేవని గుర్తించి నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎఎస్ శ్రీకాంత్ తదితరులున్నారు.

## మాల పోచమ్మ ఆలయానికి గ్రానైట్ రాయి అందజేసిన ఎమ్మెల్యే


ఆలయం వద్ద బీజేపీ నాయకులు

**నవతెలంగాణ-కామారెడ్డి**

ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి బిజెపి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణారెడ్డి కామారెడ్డి నియోజకవర్గంలోని బిబిపేట మండలం ఉప్పరిపల్లి గ్రామం మాల పోచమ్మ ఆలయానికి శుక్రవారం గ్రానైట్ రాయిని అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి కామారెడ్డి అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు బట్టుపల్లి రంజిత్‌గౌడ్, బిజెపి జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నక్క రవీందర్, బీజేవైఎం మండలాధ్యక్షులు పోసు శివకుమార్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి అల్లం ప్రవీణ్, మండల ఉపాధ్యక్షులు సంతోష్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు శ్రీనివాస్, భూతు అధ్యక్షులు బైండ్ల బాలునర్సు, కార్యకర్తలు తేజ, మన్నే వేణు, ఉప్పర్‌పల్లి మాలపోచమ్మ కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామపంచాయతీని ప్రారంభించిన బోధన్ ఎమ్మెల్యే


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**నవతెలంగాణ-రెంజల్**

మండలంలోని అంబేద్కర్‌నగర్ గ్రామంలో శుక్రవారం సాయంత్రం మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ హయాంలోని బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. రూ.20లక్షల వ్యయంతో నిర్మించే ఈ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రెంజల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మొబిన్‌ఖాన్, మాజీ జెడ్పిటిసి నాగభూషణంరెడ్డి, ధనుంజయ్, సిహెచ్ రాములు, జావిద్, గంగాకృష్ణ, ఓ.మోహన్, మైని మోహన్, వర్దవ్, వసంత్, బన్నియ నాయక్, షాపుక అలీ, ఉబేద్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటించాలి


కళా ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-తాడ్వాయి**

వాహనదారులు రోడ్డు నియమాలు పాటించి వాహనాలు నడపాలని కాంగ్రెస్ గ్రామ ఉపాధ్యక్షులు గైని రాజలింగం తెలిపారు. మండలంలోని ఎర్రపాడ్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో కళా ప్రదర్శన నిర్వహించినట్టు వివరించారు. కలెక్టర్, ఆర్‌టీఏల ఆదేశాల మేరకు కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మద్యం సేవించి అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురికావొద్దని ప్రదర్శన ద్వారా వినిపించారు. ఈ ప్రదర్శనలో సీనియర్ కళాకారులు రమేష్‌రావు, తదితరులున్నారు.

## పోచారం కుటుంబంపై మాట్లాడితే ఖబడ్దార్


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**నవతెలంగాణ-వర్ని**

గత నాలుగు రోజుల క్రితం కవిత బాన్సువాడలో ప్రెస్‌మీట్ పెడితే ఈ పనికిరాని ఏనుగు గ్రూప్ యలమంచిలి శ్రీనివాస్‌రావు పోచారం కుటుంబంపై లేనిపోని ఆరోపణలు చేశారని.. ఖబడ్దార్ యలమంచిలి అని ఏఎంసీ చైర్మన్ సురేష్ బాబా హెచ్చరించారు. శుక్రవారం వర్ని మండల కేంద్రంలో సీసీడీ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు, మైనారిటీ నాయకులు మాట్లాడుతూ.. 'ఏనుగు రవీందర్‌రెడ్డి నీవు ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టినావు. ఇప్పుడు బాన్సువాడలో పార్టీని బొంద పెట్టడానికి ప్రయత్నం చేస్తున్నావు. ఎందుకూ పనికిరాని యలమంచిలి అనే వ్యక్తికి డబ్బులు ఇచ్చి ప్రెస్‌మీట్ పెట్టించి మా నాయకులు పోచారం కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారు. మీరు ఇంతకు కాంగ్రెస్ పార్టీ వారేనా..?' అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన పోచారం కుటుంబం నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు నేమాని వీర్రాజ్, మైనారిటీ నాయకులు భారీ, గోపాల్, గిరి, శ్రీనగర్ రాజు, మాజీ జడ్పీటీసీ బాద్యనాయక్, నారోజీ గంగారాం, నామాల సాయిబాబా, కృష్ణరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ హైమద్, మూడ్ అంబర్ సింగ్, సీహెచ్ గంగారాం, శనిగరం కిషన్, బిందెల సంజీవ్, పలు గ్రామాల కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



**నవతెలంగాణ-పిట్లం**

అనుమానాస్పద స్థితిలో మహిళా మృతి చెందినట్టు స్థానిక ఎస్సై రాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన గొరిగి సత్యవ్వ (55) సుమారు 38 సంవత్సరాల క్రితం అల్లాపూర్ గ్రామానికి చెందిన అంజికొండతో వివాహమైంది. ఆమెకు కూతురు భర్తతో గొడవలు జరిగి చిన్నకొడప్‌గల్ గ్రామంలోనే నివాసం ఉంటోంది. కాగా గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో సత్యవ్వ అన్న పాపికొండ సత్యావా పొద్దటి నుంచి కనిపించడం లేదని ఆమె ఇంటికి వెళ్లి చూడగా సత్యవ్వ ఇంట్లోనే చనిపోయి ఉంది. ఆమె ఒంటిపై ఉన్న బంగారు చెవి పోగులు, గువ్వ పోగులు, పుస్తే, నల్లపూసల దండ, రెడ్‌మెడ్ రెండు ముక్కుపుడకలు, కనిపించలేదని అవి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను చంపి ఆభరణాలు దొంగిలించినట్టు మృతురాలి అన్న గొరిగే పాపికొండ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సన్మానం


చైర్మన్‌ను సన్మానిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు

**నవతెలంగాణ-భిక్కనూర్**

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డిని సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లాలో గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు లింగారెడ్డి, కార్యవర్గ సభ్యులు, రెడ్డి సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో బాధపడుతూ ఒకరి మృతి



**నవతెలంగాణ-ఎడపల్లి**

అనారోగ్యంతో బాధపడుతూ ఒకరి మృతిచెందారు. ఈ ఘటన రుద్రూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన శాకరి సాయిలు మేస్త్రి (36) ఐదు రోజుల క్రితం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో శుక్రవారం సాయంత్రం మృతిచెందారు. సాయిలుకు భార్య, కుమారుడు, కుమార్తె, ఉన్నారు.

## కల్తీకల్లు విక్రయిస్తే చర్యలు తప్పవు

- ఎక్సైజ్ సీఐ మధుసూదన్ రావు


మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ మధుసూదన్ రావు

**నవతెలంగాణ-భిక్కనూర్(రాజంపేట్)**

కల్తీకల్లు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ మధుసూదన్‌రావు హెచ్చరించారు. శుక్రవారం రాజంపేట్ మండలంలోని తలమడ్ల, ఆరేపల్లి గ్రామాలలో కల్లు దుకాణాలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్లు శాంపిల్ సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే విధంగా కల్తీ కల్లు విక్రయించవద్దని కల్లు నిర్వాహకులకు సూచించారు. ఈ తనిఖీలలో ఎక్సైజ్ ఎస్సై దీపిక, హెడ్ కానిస్టేబుల్ మొయినుద్దీన్, కానిస్టేబుల్ శరత్, మహేష్, సిబ్బంది, తదితరులున్నారు.

## అవయవదానం చేసిన కుటుంబానికి పత్రం అందజేత

**నవతెలంగాణ-భిక్కనూరు**

మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఇటీవల కాలంలో గ్రామానికి చెందిన మల్లయ్య హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో మరణించారు. మల్లయ్య మరణించిన అనంతరం అవయవదానం చేయడానికి ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులకు జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధి శివకుమార్ మల్లయ్య భార్యకు శుక్రవారం అవయవ దానం చేసినందుకు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు భీమ్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు లింగారెడ్డి, స్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్చరీ క్రీడా పోటీల్లో రాణించాలి


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

**నవతెలంగాణ-దోమకొండ**

ఆర్చరీ క్రీడా పోటీల్లో రాణించాలని ఆర్చరీ అసోసియేషన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కామినేని అనిల్, ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తిరుమల గౌడ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని గడికోటలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి జూనియర్ ఆర్చరీ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్చరీ క్రీడా పోటీలలో క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయి ఆర్చరీ క్రీడా పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్చరీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నం రాంచంద్రం, జిల్లా కార్యదర్శి కదిరే మోహన్‌రెడ్డి, కోచ్ ప్రతాప్‌దాస్, మురళి, బిజెపి మండలాధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మధు, మాజీ ఎంపీటీసీ కడారి రమేష్, ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు.

## కూలీల పనిదినాలు గుర్తించి నమోదు చేయాలి

- డీఆర్‌డీఏ పీడీ సురేందర్


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సరేందర్

**నవతెలంగాణ-తాడ్వాయి**

భూమిలేని కూలీలు సంవత్సరంలో చేపట్టిన పనిదినాలు గుర్తించి కంప్యూటరీకరణ చేయాలని డీఆర్‌డీఏ పీడీ మర్రి సురేందర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎన్ఆర్ఈజీఎస్‌లో నమోదును పరిశీలించారు. కూలీలు సంవత్సరంలో ఎన్ని రోజులు పని చేశారో గుర్తించి కనీసం 20 రోజులు పనిచేసిన కూలీలను గుర్తించాలని ఆదేశించారు. కూలీల ఆధార్ నెంబర్‌తో పాటు బ్యాంక్ ఖాతాలను నమోదు చేసి పనిచేసిన దినాలను సైతం నమోదు చేసినట్లయితే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు అర్హులవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రహీముద్దీన్, ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీఓ సవితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## అతివేగం ప్రమాదకరం కళా ప్రదర్శన ద్వారా


కళా ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

**నవతెలంగాణ-లింగంపేట్**

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆటలు పాటల రూపంలో వాహనదారులకు వివరించారు. హెల్మెట్ ధరించి బైకులు నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. అతివేగం ప్రమాదకరమని, ట్రాఫిక్ రూల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని వారు పాటల ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విట్టల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శిల్ప సవిత, విద్యా లక్ష్మీనారాయణ, తిరుపతి, రమేష్, నరేష్, పోశెట్టి పోలీసులు వాహనదారులు కళాకారులున్నారు.

## పద్మశాలి సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

**నవతెలంగాణ-జుక్కల్**

మండలంలోని మార్కండేయ మందిరంలో పద్మశాలి సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అలాగే రాష్ట్ర మీడియా ఉపాధ్యక్షులుగా ఎంపికైన బోడ సాయిలును ఘనంగా సన్మానించారు. ఫిబ్రవరి 1న జరిగే మార్కండేయ జయంతిని ఘనంగా జరపాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌బాల్‌లో కీర్తనకు గోల్డ్ మెడల్



నవతెలంగాణ-మాక్లూర్

జమ్ము కాశ్మీర్‌లో జరిగిన ఆల్ ఇండియన్ నేషనల్ సాఫ్ట్‌బాల్‌లో డిచ్‌పల్లిలోని సుద్దపల్లి గురుకుల హాస్టల్‌లో 9వ తరగతి చదువుకుంటున్న మాక్లూర్ మండలంలోని ఒడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన దుద్దు కీర్తన గోల్డ్ మెడల్ సాధించింది. ఈసందర్భంగా రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి ఆమెను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో దుద్దు గంగాధర్, సాఫ్ట్ బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగ మోహన్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్లో పట్టుబడిన 5 గురికి జైలు శిక్ష

- 19 మందికి జరిమానా

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 5గురికి జైలు శిక్ష విధించగా 19 మందికి జరిమానా విధించినట్టు నిజామాబాద్ ట్రాఫిక్ సిఐ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. ట్రాఫిక్ సిఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మద్యం తాగి వాహనాలు నడిపిన 24 మందికి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్‌జాన్ ముందర హాజరుపరచగా 19 మందికి జరిమా రూ.43500 విధించారు. గాజుల్ పేటకు చెందిన గేనే సునీల్కు ఒకరోజు జైలు శిక్ష, ఎల్లమ్మ గుట్టకు చెందిన కాదా సి.వినోద్, దుబ్బకు చెందిన బి.ప్రవీణ్, గంగ స్థాన్‌కు చెందిన రామ్‌రెడ్డి, నాగారంకు చెందిన గోలికార్ దినేష్ లకు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్టు సీఐ తెలిపారు.

## విరగబూసిన మామిడి పూత



నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రానికి చెందిన గైని సంజీవ్ థామస్ అనే రైతు వ్యవసాయ భూమిలో ఉన్న మామిడి చెట్టుకు నిండుగా పూతపూయడంతో ఆ మామిడి చెట్టు చూపరులను ఎంతో ఆకర్షణకు గురిచేస్తోంది. రానున్న వేసవి కాలం నాటికి మామిడికాయలు విరగకాస్తాయి.

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

- ట్రాఫిక్ ఏసిపి నారాయణ
- రిలయన్స్ మాల్‌లో అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించాలని నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి నారాయణ తెలిపారు. శుక్రవారం నగరంలోని వినాయక్ నగర్‌లో గల రిలయన్స్ మాల్‌లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ నారాయణ, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది ఆధ్వర్యంలో ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్, రాంగ్ సైడ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ అనే అంశాలపై క్షుణ్ణంగా సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో సుమారు 50 మంది రిలయన్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**ట్రాఫిక్ పోలీసులకు బారికేడ్ల అందజేత**

నిజామాబాద్ మెడికవర్ ఆసుపత్రి వారి సౌజన్యంతో ప్రజల సౌకర్యార్థం ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసే బారికేడ్లను శుక్రవారం ట్రాఫిక్ ఏసీపీకి అందజేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని ట్రాఫిక్ పోలీసులకు 50 బారికేడ్లను అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ ప్రసాద్, ఎస్సైలు, ట్రాఫిక్ సిబ్బంది, మార్కెటింగ్ హెడ్ వినయ్ కుమార్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.




ట్రాఫిక్ పోలీసులకు బారికేడ్లను అందజేత

## బాల్ బ్యాడ్మింటన్‌కు క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నాగపూర్‌లో జరిగే 62వ జాతీయ స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌కు నిజాంబాద్ జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 18 నుంచి 22 వరకు మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లాలో జరిగే బాల్ బ్యాడ్మింటన్ కోసం తెలంగాణ బాలుర, బాలిక జట్టును ఎంపిక చేశారు. సన్నదాత శిబిరం ముగింపు కార్యక్రమంలో తుది జట్టును ఎంపిక చేశారు. తుది జట్టులో నిజామాబాద్ జిల్లా క్రీడాకారులు సాయి శివ, పండరి, స్ఫూర్తి ఎంపికయ్యారు. క్రీడాకారుల ఎంపిక పట్ల తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి వివి రమణ, జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు మానస గణేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, తెలంగాణ రెసిడెన్షియన్స్ స్కూల్ డిస్టిక్ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నీరజ, సీనియర్ క్రీడాకారులు, తదితరులు అభినందించారు.



## పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం



పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో సామాజిక సామరా స్యలో భాగంగా పారిశుధ్య కార్మికులను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఇందూర్ జిల్లా కార్యదర్శి గాజుల దయానంద్, జిల్లా విశేష సంపర్కప్రముఖ్ అల్జాపూర్ అక్షయ్, ప్రచార ప్రముఖ్ నిఖిల్, నగర అధ్యక్షులు గంగాచరణ్, నగర భగవద్గీత ప్రముఖ్ గంగాధర్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిబంధనల ప్రకారం ఉద్యోగ నియామక ప్రక్రియ

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో వివిధ కేటగిరిల్లో జరుగుతున్న ఉద్యోగ నియామక ప్రక్రియలో ఎటువంటి అవకతవకలు లేకుండా పారదర్శకంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నుండి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంతవరకు ఎక్కడకూడా అక్రమార్కులకు తావు లేకుండా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయడం జరిగిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో వైద్య ఆరోగ్య శాఖలో ఎటువంటి అవినీతి జరిగిన, అది ఎవరి దృష్టికి వచ్చిన జిల్లా వైద్య-ఆరోగ్యశాఖ కార్యాలయంలో వివరాలతో ఫిర్యాదు చేసినట్లయితే తప్పకుండా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరుకూడా మోసపూరిత వ్యక్తుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఎటువంటి చరవాణి సంప్రదింపులకు, దళారీలకు లొంగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుని అనుమానాలుంటే తిన్నగా జిల్లా వైద్య ఆరోగ్ని కాధికారి డా. రాజశ్రీని సంప్రదించి నివృతి చేసుకోవచ్చుని తెలియజేశారు.

## క్రికెట్ టోర్నీ విజేత బాబాపూర్ జట్టు



ట్రోఫీని అందుకుంటున్న బాబాపూర్ జట్టు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ మండల్ పురనిపెట్ గ్రామంలో వారం రోజుల నుండి నిర్వహిస్తున్న కస్తూరి రాజుబాయి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్‌లో బాబాపూర్, పురాణిపేట్ జట్లు తలపడగా విన్నర్ గా బాబాపూర్ జట్టు, రన్నర్ ఆఫ్‌గా పురాణిపేట్ నిలిచాయి. మొదట బ్యాటింగ్ చేసిన బాబాపూర్ జట్టు నిర్దేశించిన 52 పరుగుల ఆరు ఓవర్లలో టార్గెట్‌ని పురాణిపేట్ జట్టు ఒక్క పరుగు వెనుకబడి విజయ అవకాశాన్ని కోల్పోయారు. అనంతరం విజేతలకు ట్రోఫీ ప్రైజ్ మనీ10వేలు అందజేశారు, రన్నర్ ఆఫ్ గా నిలిచిన పురాణిపేట్ జట్టుకు ట్రోఫీ 7000 ప్రైజ్ మనీ మేనేజ్మెంట్, గ్రామస్తులు అందజేశారు.

## సోయా పంటను కొనుగోలు చేయాలి

- ఎమ్మెల్యేకు రైతుల విజ్ఞప్తి
- అధికారులతో మాట్లాడతానని రైతులకు హామీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మార్కెట్ యార్డులో నిలిచిపోయిన సోయా కొనుగోలును ప్రారంభించాలని రైతులు శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి తరలివెళ్లి ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు విన్నవించారు. ఈ మేరకు సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి మిగిలిపోయిన రైతుల సోయా పంట కొనుగోలు కొరకు కషి చేస్తానని రైతులకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినందుకు సోయా పంట రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# డబుల్ బెడ్ రూమ్‌లను లబ్ధిదారులకు అందించాలి

- సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్.రమేష్

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలో గత ప్రభుత్వం నిర్మాణం పూర్తి చేసిన డబుల్ బెడ్ రూమ్‌లను లబ్దిదారులకు అందించాలని, లేకపోతే లబ్దిదారులతో ఆక్రమిస్తామని సిపిఐ (ఎంల్ ) మాస్ లైన్ ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి, ఆర్ రమేష్ స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్మాణం పూర్తి అయిపోయిన డబుల్ బెడ్ రూమ్‌లను లబ్దిదారులకు ఇవ్వాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. గత కెసిఆర్ ప్రభుత్వం పేదవాళ్లకు డబుల్ బెడ్ రూమ్ అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అందులో భాగంగా మండల కేంద్రంలోని పేదప్రజలకు అందించడానికి లక్షల డబ్బులు హెచ్చించి నిర్మాణం చేపట్టారు. ఇక నిరుపేదలు తమ కల నెరవేరుతుందని ఎంతో ఆశగా ఎదురు చూసే వారికి నిరాశ మిగిలిందని ఆయన పేర్కొన్నారు. డబుల్ బెడ్రూంలో నిర్మాణం పూర్తయిన "అంగట్లో అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని ఉన్నట్లు" అన్నట్లుగా అలాట్మెంట్ చేయలేదని, నిరుపేదలు అయినా లబ్దిదారులకు అవి అందించలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ విషయంలో చొరవ చూపి, మానవతా దృక్పథంతో ఆలోచించి నిరుపేదలైన లబ్దిదారులకు అందేలాగా చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులు స్వరూప, లక్ష్మి, తారు, గంగామణి, తదితరులు పాల్గొన్నారు.




వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

# ప్రభుత్వాన్ని బద్నాం చేయడం సరికాదు

- కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ప్రభుత్వాన్ని బద్నాం చేయడం సరికాదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడ్డం నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి గత మూడు నెలలుగా బాల్కొండ నియోజకవర్గంలోని కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీకి సమయం ఇవ్వకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని బద్నాం చేసే పనిలో ఉన్నారన్నారు. మూడు నెలల నుంచి చెక్కులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. లబ్ధిదారులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రశాంత్‌రెడ్డి ఇకనైనా మీ ఆలోచనలలో మార్పు రావాలని లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా సమయం ఇవ్వాలన్నారు. మీరు చేస్తున్న విధానాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాబోయే రోజులలో స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో దామోదర్‌గౌడ్, రమణ, నరేందర్, మల్లేష్, మల్లయ్య రవి మల్లారెడ్డి, రవి, మోహన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి

# 20 లోపు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-ఆర్మూర్/ముప్కాల్

ఈ నెల 20లోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా మండలంలోని ఫతేపూర్ గ్రామాల్లో సర్వే బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన తీరును తనిఖీ చేశారు. వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం అర్హులను గుర్తించేందుకు అవలంబిస్తున్న విధానాలను, సర్వే బృందాలు ఇంటింటికి తిరుగుతూ సేకరిస్తున్న వివరాలను పరిశీలించారు. జలాల్పూర్ శివారులోని ఆయా సర్వే నంబర్లలో గల రైతులకు సంబంధించిన పట్టా భూములను, అసైన్డ్ స్థలాలను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా సేకరించిన వివరాలను రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. త్వరితగతిన ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్దిదారుల జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఫీల్డ్ వెరిఫికేషన్ కొనసాగుతోందని తెలిపారు. ముఖ్యంగా రైతు భరోసా పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు లబ్ది చేకూర్చేందుకు వీలుగా సాగుకు యోగ్యమైన భూములను సర్వే నెంబర్ల వారీగా క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిర్ధారించడం జరుగుతోందన్నారు. ఆహార భద్రతా కార్డులను అర్హత కలిగిన కుటుంబాలకు అందించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికార బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నాయని తెలిపారు. ఈ నెల 20 నాటికి ఆయా పథకాల కింద అర్హులైన వారి జాబితాలను రూపొందించి, 21 నుండి 24 వరకు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో నిర్వహించనున్న గ్రామ సభలలో వాటిని ప్రవేశపెట్టి చదివి వినిపించడం జరుగుతుందన్నారు. గ్రామ సభ ఆమోదం మేరకు లబ్దిదారుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. ఈ నెల 26న ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు శ్రీకారం చుట్టి లబ్దిదారులకు ప్రయోజనం చేకూర్చనుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజాగౌడ్, ఆయా మండలాల స్పెషల్ ఆఫీసర్లు స్రవంతి, రసూల్ బీ, బాల్కొండ ఎంపిడిఓ విజయభాస్కర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

**ముప్కాల్ :** మండలంలోని నాగంపేట్ గ్రామంలో శుక్రవారం అధికారులు చేపట్టిన సర్వేను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్‌తో పాటు ఆర్మూర్ ప్రత్యేక అధికారి రాజస్వి ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీకోసం చేపడుతున్న సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి స్రవంతి, ఎంపీడీవో నరేష్ ఆనంద్, తహశీల్దార్ కృష్ణ, డిప్యూటీ తహశీల్దార్ పి.శ్రీకాంత్, మండల పంచాయతీ అధికారి గౌస్ మోహినొద్దీన్ మండల వ్యవసాయధికారి సాయి కృష్ణ, ఏపీవో ప్రసాద్ రావ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు మల్లేష్ యాదవ్, గౌతమి, హన్మాండ్లు, నరేష్, రాజు, విఘ్నేష్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



సర్వే బృందాలతో మాట్లాడుతున్న కలెక్టర్

## హైదరాబాద్‌కు తరలివెళ్లిన కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లు



హైదరాబాద్‌కు తరలిన కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌ను కలవడానికి కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లు హైదరాబాద్‌కు శుక్రవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ.. కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌ను కలవనున్నామన్నారు. వేతనాల పెంపు, ఇతర సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర కమిటీ నిర్మాణ జనరల్ బాడీ సమావేశం జరిపి నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. హైదరాబాద్ వెళ్ళిన వారిలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వరి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, నాయకులు, తదితరులు ఉన్నారు.

## నాగపూర్ సెకండ్ లిఫ్ట్‌కు మోటార్ పంపిణీ



నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని నాగపూర్ గ్రామ అభివృద్ధి కమిటీ తమ గ్రామంలోని సెకండ్ లిఫ్ట్ కు మోటార్లు అవసరం ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలోనే ఆ లిఫ్టుకు ఒక మోటార్ ని పంపిణీ చేశారు. రెండవ మోటార్ కోసం కూడా వారు అడగగా ముత్యాల సునీల్ కుమార్ సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించి లిఫ్ట్‌కు రెండవ మోటార్‌ని కూడా పంపిణీ చేశారు. అడగగానే స్పందించి మోటార్ లు మంజూరు చేయించిన ముత్యాల సునీల్ కుమార్‌కు గ్రామ అభివృద్ధి కమిటీ, గ్రామ ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

## ఇసుక ట్రాక్టర్ సీజ్

నవతెలంగాణ-భీంగల్ రూరల్

ఈనెల 16న మధ్య రాత్రి సమయంలో భీంగల్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని సీజ్ చేశారు. భీంగల్ పట్టణంలో ఇసుక లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్‌కు ఇసుకకు సంబంధించిన పత్రాలు అడుగగా ఎలాంటి పత్రాలు చూపించలేదు. దీంతో అక్రమంగా తరలిస్తున ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడుతూ.. పర్మిషన్ లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సూచించారు.

## పిఆర్‌టీయు క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కామారెడ్డి

పి ఆర్ టి యు తెలంగాణ కామారెడ్డి జిల్లా పక్షాన జిల్లా విద్యాధికారి ఎస్.రాజు కు నాయకులు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం క్యాలెండర్ ఆవిష్కరణ జిల్లా విద్యాధికారి చేతుల మీదుగా ఆవిష్కరింప చేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు తెలంగాణ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంబీర్ మనోహర్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి జనపాల లక్ష్మీరాజం, రాష్ట్ర, జిల్లా బాధ్యులు గిరి, ఆనంద్, శ్రీధర్ రావు, సురేందర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఏమైనా సమస్యలన్నాయా?

● ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు మేనూర్ వారసంతలో వ్యాపారులకు పలకరింపు

నవతెలంగాణ-మద్నూర్



మండలంలోని మేనూర్ గ్రామ వారాంతపు సంతలో ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు శుక్రవారం పర్యటించారు. సంతలో కూరగాయలు విక్రయించడానికి వచ్చిన వ్యాపారులతో ఎమ్మెల్యే ముచ్చటించారు. వారి దగ్గర కూరగాయలు కొనుగోలు చేశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు .ఎమ్మెల్యే ఒక సామాన్యుడిలా సంతలో పర్యటించి తమ సమస్యలు తెలుసుకొని కూరగాయలు కొనుగోలు చేయడం పట్ల రైతులు, వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

## గ్రామ అధ్యక్షులకు, సిబ్బందికి లావాదేవీలపై అవగాహన

డిపిఎం సంధ్యారాణి

నవతెలంగాణ-రెంజల్



మండలంలోని వివిధ గ్రామ సమైక్య లోని సెర్ప్ ఇంటర్నల్ ఆడిట్లో భాగంగా డిపిఎంతోపాటు, డీఎంజీలు మధు, మురళీలు లావాదేవీలను క్షుణ్ణంగా పరిశీలించారు. డిపిఎం సంధ్యారాణి గ్రామ అధ్యక్షులు, సిబ్బందికి లావాదేవీలపైన పూర్తి అవగాహన వచ్చేలా వివరించారు. సీఏలు డ్వాక్రా మహిళల రుణాల రికవరీలో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. సంబంధిత రిజిస్టర్లను ఎప్పటికప్పుడు పూర్తి చేసి ఉంచాలని సీఏలకు ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీఎం చిన్నయ్య, సీసీలు భాస్కర్, కృష్ణ, రాజయ్య, శివకుమార్, సునీత, కంప్యూటర్ ఆపరేటర్ తస్లీమా, గ్రామ అధ్యక్షులు, సిఏలు, పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్లను బాటిల్స్‌లో వేయాలి

● జిల్లా సైన్స్ అధికారి సిద్దిరాం రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రతి ఇంటినుండి కనీసం 10 నుండి 20 ప్లాస్టిక్ సంచులు ప్రతిరోజూ వస్తుంటాయి (నూనె సంచి, పాల సంచి, కిరాణా సంచి, షాంపూ, సబ్బు, మ్యాగీ, కుర్కురే మొదలైనవి) రోజూ డస్ట్‌బిన్‌లకు బదులు వాటర్ బాటిళ్లలో ఆ బ్యాగులను వేయాలని జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు సూచించారు. ప్రతి ఇంటిలో వారానికి ఒకసారి సీసాని నింపవచ్చని పేర్కొన్నారు. సరైన మూతతో డస్ట్‌బిన్‌లో వేయవచ్చని పేర్కొన్నారు. ఇలా చేయడం వల్ల జంతువులు చెల్లాచెదురుగా ఉన్న ప్లాస్టిక్‌ను తినవని, ప్లాస్టిక్ వ్యర్థాలు, వాటర్ బాటిళ్లను సక్రమంగా పారవేసే అవకాశం ఉంటుందని తెలిపారు. చెత్తను సేకరించేందుకు పారిశుద్ధశాఖకు కూడా సౌకర్యంగా ఉంటుందని, ఈ సీసాలను ఎకో బ్రిక్స్‌గా ఉపయోగించ వచ్చని పేర్కొన్నారు. బెంచీలు, కుండలు లేదా అలంకరణ వస్తువులను కూడా తయారు చేయవచ్చని తెలిపారు. ప్రతి ఇంటివారు ఈ ఆవశ్యకతను గుర్తించి ఈ పనిని ప్రారంభించాలని కోరారు.

# గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

● డిఎస్పి శ్రీనివాస్
● కబడ్డీ విజేత హాజీపూర్ తాండ
● రసవత్తరంగా కబడ్డీ పోటీలు



విజేతగా నిలిచిన జట్టు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

ఆటల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్ అన్నారు .శుక్రవారం రాత్రి ఎల్లారెడ్డి పట్టణ సమీపంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సమీపంలో గల వెంచర్లో నిర్వహించిన కబడ్డీ పోటీలో బహుమతుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా స్వీకరించి ఓడిన వారు గెలుపు కోసం కసరత్తు చేయాలన్నారు. కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారని వారిని అభినందించారు. ప్రతి ఒక్కరికి విద్యతోపాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. జిల్లా స్థాయిలో తలపించేలా మదన్ అన్న కబడ్డి పోటీలు నిర్వహించినందుకు మాజీ మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణను, నిర్వాహకులను ఆయన అభినందించారు. హోరా హెూరి పోటీలో హాజీపూర్ తాండ విజయం సాధించారు. ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తాండ 51 వేల రూపాయల మొదటి విజేతగా బహుమతిని గెలుపొందారు. రెండవది ఎల్లారెడ్డి టీం 21వేల రూపాయలు రెండో బహుమతిని తీసుకున్నారు. మూడో విజేతగా భిక్కనూర్, మాచాపూర్ క్రీడాకారులు 11 వేల రూపాయలు బహుమతిని గెలుచుకున్నారు. మధ్యాహ్నం క్రీడాకారులకు భోజనం ఏర్పాటు చేయడంతో నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎల్లారెడ్డి సింగిల్ విండో వైస్ చైర్మన్ ప్రశాంత్ గౌడ్, మాజీ జెడ్పిటిసి సామెల్, మాజీ సింగిల్ విండో చైర్మన్ బోండ్ల సాయిలు, డైరెక్టర్ సుఖేందర్ రెడ్డి మండల కాంగ్రెస్ నాయకులు ఆయా గ్రామాలకు చెందిన క్రీడాభిమానులు క్రీడాకారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా అమలు చేస్తున్న కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని అసిస్టెంట్ లెబర్ కమిషర్ ముత్యంరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణలైన వారికి ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. సంక్షేమ మండలికి రూ.7 చెల్లించిన కార్మికులు దీనికి అర్హులని చెప్పారు. ఫిబ్రవరి 15లోగా దరఖాస్తులను కార్యాలయంలో అందించాలని సూచించారు. కార్మికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పదో తరగతి నుంచి ఎంబీబీఎస్ వరకు వెయ్యి రూపాయల నుంచి రెండు వేల రూపాయల వరకు ఉపకార వేతనం వస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

## ఎకలో అణోచ ఎకలో జాణోచ్ పాట విడుదల

నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని అనిష్ ఫోటో స్టూడియోలో శుక్రవారం కవన కోకిల జాదవ్ బంకట్ లాల్ గానం చేసిన ఎకలో అణోచ ఎకలో జాణోచ్ పాటను రాథోడ్ భీంరావ్ నాయక్, బంజారా రచయితల వేదిక అధ్యక్షులు డాక్టర్ ఇందల్ సింగ్ బంజారా, లైవ్ నాయకులు జాదవ్ వసంత్, బానోతు రవీందర్, ప్రొడ్యూసర్ సేవాదాస్, పరమేశ్వర్ చవాన్, జాదవ్ మురళి, పవార్ వినోద్‌లు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాథోడ్ భీంరావ్ నాయక్ మట్లాడుతూ కవన కోకిల జాదవ్ బంకట్ లాల్ బంజారా రచయితల వేదిక గౌరవాధ్యక్షులు బంజారా సమాజానికి తన గానంతో, రచనలతో ఆనందింప జేయడమే ఎకైక లక్ష్యంతో ముందుకు వెళుతున్నారని ఎలాంటి ఫలం ఆశించకుండా సమాజానికి సేవ చేయాలనే తపన వారిలో ఉంటుందని చెప్పారు. డాక్టర్ ఇందల్ సింగ్ బంజారా మాట్లాడుతూ కవన కోకిల జాదవ్ బంకట్ లాల్ బంజారా సమాజానికి లభించిన ఆణిముత్యం లాంటి కళాకారులని ప్రశంసించారు ఈ కార్యక్రమంలో గోవింద్, అర్జున్, రవీందర్ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న లెక్చరర్లు

## తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ క్యాలండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ కామారెడ్డి జిల్లా క్యాలండర్‌ను శుక్రవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం మాట్లాడుతూ.. ఈ క్యాలండర్ ద్వారా సంస్థకు సంబంధించిన సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలను, కార్యాచరణ ప్రణాళికను ప్రతిఫలించడం జరుగుతుందన్నారు. అధునాతన, నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాల్సిన బాధ్యత మనపై ఉంది. విద్యారంగాన్ని ప్రగతిపథంలో కొనసాగించేందుకు కళాశాలల స్థాయిలో అసోసియేషన్ నిరంతరం పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జెట్టి విజయ్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎన్.లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షుడు పి. రాజగోపాల్, లెక్చరర్లు శ్రీధర్, రమేష్, వెంకటస్వామి, సరిత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## కొలాం, గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని జెండాగూడ, మొర్రిపేట్, శివగూడ గ్రామాలలోని కొలాం, నాయక్ పోడు గిరిజనులకు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ శుక్రవారం దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ ప్రాంతంలోని నిరుపేదలకు సేవ చేయడమే తమ లక్ష్యమని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల గ్రామాలలో పెరుగుతున్న చలిని దృష్టిలో ఉంచుకొని నిరుపేద కొలాం, నాయక్‌పోడు గిరిజనులకు తమవంతుగా దుప్పట్లను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బానోత్ జైవంతరావు, ఆర్టీఏ జిల్లా సభ్యులు దూట రాజేశ్వర్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి చంద్రయ్య, ఉట్నూర్ మండల అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యుం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇక్బాల్, మాజీ సర్పంచ్లు భీమన్న, జగదీష్, కాంగ్రెస్ నాయకులు దాసండ్ల ప్రభాకర్, రాజేష్, మహేందర్, గ్రామ పటేల్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

నవతెలంగాణ-సారంగాపూర్

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన శుక్రవారం మండలంలోని బీరవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గాడి లక్ష్మీ గుండ్లా పెద్దమ్మాయి తమ ఇంటికి తాళలు వేసి పనిపై బయటకు వెళ్లారు. అదే సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగాయి. ఇంట్లో నుంచి దట్టమైన పొగలు వస్తుండటంతో స్థానికులు గమనించి, వెంటనే తలుపులు పగలగొట్టి మంటలను నీళ్లతో ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రెండు ఇండ్లలోని గృహోపకరణలు, వస్తువులతో పాటు నిత్యావసర సరుకులు కాలి బూడిదయ్యాయి.

## మోకుదెబ్బ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ జిల్లా కేంద్రంలోని గీత పారిశ్రామిక సహకార సంఘ భవనంలో మోకుదెబ్బ జాతీయ కమిటీ-2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మోకుదెబ్బ జిల్లా అధ్యక్షులు ప్లావల గోపిగౌడ్, ముఖ్య అతిథులుగా మోకుదెబ్బ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ గౌడ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మెన్ అమరవేణి నర్సాగౌడ్, జాతీయ ముఖ్య సలహాదారులు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కోల జీవన్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. రాజ్యాధికారం సాధనకై గౌడ కులస్తులు రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పోటీ చేసి గెలువాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు పడాల రాజేందర్‌గౌడ్, కొండ బాలగౌడ్, యాగండ్ల దశాగౌడ్, తీగెల వెంకట్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివ్వాల రవీందర్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి కొండ మురళిగౌడ్, జిల్లా నాయకులు, ఉప్పునూతుల వేణు గోపాల్‌గౌడ్, టి.గణేష్ గౌడ్, ఏ.రమేష్‌గౌడ్, ఎం.దేవేందర్‌గౌడ్, జి.వినోద్‌గౌడ్, డి.సాయి బాబాగౌడ్, ఉప్పునూతుల లక్ష్మి నారాయణగౌడ్, మనోహర్‌గౌడ్, యు. శ్రీనివాస్ గౌడ్‌లతో పాటు పలువురు గౌడ కులస్తులు పాల్గొన్నారు.

## ఖాందేవ్ ఆలయ ఆవరణలో మరుగుదొడ్ల నిర్మాణం

నవతెలంగాణ-నార్నూర్

ఖాందేవ్ ఆలయ ఆవరణలో రూ.3లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు ఆలయ కమిటీ సభ్యులు తీర్మానించినట్టు శుక్రవారం ఎంపీడీఓ జవహర్‌లాల్, మిషన్ స్వచ్ఛ భారత్ జిల్లా కోఆర్డినేటర్ సందీప్ తెలిపారు. స్వచ్ఛ భారత్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులలో చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. దీనికి సంబంధించి మండల కేంద్రంలోని ఖాందేవ్ ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ చైర్మెన్ తొడసం నాగోరావ్‌తో కలిసి నిర్మాణ పనులకు కొలతలు ఇచ్చారు. భక్తుల సౌకర్యార్థం కోరకు పనులు చేపడుతున్నట్టు గడువులోగా పనులు పూర్తి చేయాలని కోరారు. ఆలయ అభివృద్ధికి మరింత కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులకు శాలువాతో సన్మానం చేశారు. ఇందులో ఏపీఓ జాదవ్ సురేష్, టీఏ సచిన్, కైలాష్ మాజీ ఎంపీపీ మెస్రం రూపదేవ్, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## నాగోబా జాతర నిర్వహణకు తైబజార్ వేలం

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా జాతర ఏర్పాటు చేసే తైబజార్‌కు మండల అధికారులు శుక్రవారం కేస్లాపూర్ గ్రామంలోని నాగోబా దర్బార్ హాల్లో వేలం పాట నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా, తైబజార్ నిర్వాహకును రూ.7లక్షల 26వేలకు కేంద్రే అవధూత్ దక్కించుకున్నారు. అలాగే జాతరలో దుకాణ సముదాయాలకు విద్యుత్ సరఫరాకు రూ.2లక్షల ఒక వేయికి ఎండీ బాబా, జాతరలో ప్యాలాలు, పుట్నాల కోసం రూ. 50వేలకు టి.నరేష్, జాతరలో కొబ్బరి కాయల విక్రయానికి రూ. 20వేలు బి.శివా వ్యాపారస్తులు దక్కించుకున్నట్టు తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. నాగోబా జాతరలో మొత్తం వేలంపాట ద్వారా రూ.9 లక్షల 97వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగోబా ఆలయ కమిటీ ఈఓ రాజమౌళి, ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు పటేల్, మాజీ సర్పంచ్ మెస్రం రేణుక నాగనాథ్, మాజీ ఆలయ కమిటీ చైర్మెన్ మెస్రం తుకారాం, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## 20న ఆదివాసీ సంక్షేమ మహాధర్నా

నవతెలంగాణ-తాంసి

ఆదివాసీ సంక్షేమ పరిషత్ చలో ఉట్నూర్ మహా ధర్నాను విజయవంతం చేయాలని శుక్రవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ తాంసి మండల తుడుం దెబ్బ అధ్యక్షులు అత్రం భరత్ చలో ఉట్నూర్ పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న చలో ఉట్నూర్ మహా ధర్నా ఆదివాసీ సంక్షేమ పరిషత్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కోసం నిర్వహించే ఈ మహా ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

# సమస్యల వెలికితీతలో నవతెలంగాణ దిట్ట

● క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-మద్నూర్

ప్రజా సమస్యల వెలికితీతలో నవతెలంగాణ దినపత్రిక ముందు వరుసలో ఉందని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు అన్నారు. నవతెలంగాణ 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో నవతెలంగాణ దినపత్రిక దిట్ట అని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయి పటేల్, మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుటుంబ సభ్యులు సౌజన్య రమేష్, వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్, బిచ్కుంద మండల నాయకులు పుల్కల్ వెంకటరావు, మాజీ జెడ్పిటిసి నాగ్నాథ్, జుక్కల్ మండల నాయకులు రమేష్ దేశాయ్, సాయగౌడ్, మద్నూర్ మండల ముఖ్య నాయకులు విట్టల్ గురుజి, హనుమాన్లు, స్వామి, సంతోష్ మేస్త్రి, దిగంబరావ్, సచిన్, అమూల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

**పథకాల అమలులో నిర్లక్ష్యం చేయొద్దు**

**అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం**

జుక్కల్ ఎమ్మెల్యే తోటలక్ష్మీ కాంతారావు పిట్లం ఎమ్మార్వో, ఎంపీడీఓలతో సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ప్రజా ప్రభుత్వం ఈ నెల 26 నుండి రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలో జమ చేయబోతుందన్నారు. అదేవిధంగా కొత్త రేషన్ కార్డులు కూడా పంపిణీ చేయబోతున్న సందర్భంగా వాటికి సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. అర్హులందరికీ ఈ పథకాలు అందేలా చూడాలని, పథకాల అమలులో ఎటువంటి నిర్లక్ష్యం, జాప్యం జరగకూడదని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

# సంక్షేమ పథకాలను అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే

● బోధన్ ఎమ్మెల్యే ప్రొద్దుటూరు సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

ప్రభుత్వ సంక్షేమ ఫలాలను నిరుపేదలను అందేలా తమ ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలో పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలలు ప్రత్యేక దృష్టిని సారించి విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని అన్నారు. గత ప్రభుత్వం అప్పులు చేసి వాటిని తీర్చడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుందని తెలిపారు. పంట పొలాలకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగునీటి అందిస్తున్నామన్నారు. చెరుకు పంటపై రైతన్న దృష్టి సారించినట్లయితే త్వరలోనే చెరుకు ఫ్యాక్టరీని పున ప్రారంభించే ఆలోచనలో ఉందన్నారు. ఆరు గ్యారెంటీ పథకాలను విడుతల వారీగా నిరుపేదలకు అందిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు..



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

**చెక్కులు పంపిణీ..**

మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి పంపిణీ చేశారు. 105 మందికి చెక్కులను అందజేశారు. ఆయన వెంట తహసిల్దార్ శ్రావణ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు మోబిన్ ఖాన్, మాజీ జెడ్పిటిసి నాగభూషణం రెడ్డి, మహిళ అధ్యక్షురాలు ఇందిరా దేవి, సాయిబాబా గడ్, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ కురుమే శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల డెమో ప్రారంభించిన సుదర్శన్ రెడ్డి

మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ ఇండ్ల డెమోను బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు.



జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అధికారులు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి సొంత ప్లాట్లు ఉన్నట్లయితే ఐదు లక్షల రూపాయలతో ఇల్లు నిర్మించుకోవచ్చు అని ఆయన సూచించారు.

**దండిగుట్ట గ్రామపంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే**

మండలంలోని దండిగుట్ట గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీదేవి కృష్ణారావు, మార్కెటింగ్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ తనుంజయ, ఎంపీపీ మోబిన్ ఖాన్, మాజీ జెడ్పిటిసి నాగభూషణం రెడ్డి, జి సాయి రెడ్డి, సిహెచ్ రాములు, మోహన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బిజినెస్

### ఆటోమొబైల్ రంగంలో విస్తృతావకాశాలు

● ఆటో ఎక్స్‌పోలో ప్రధానీ మోడీ ● 100 ఆవిష్కరణలు



**న్యూఢిల్లీ :** దేశంలోనే అతిపెద్ద వాహన ప్రదర్శన అయినా భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో రెండో ఎడిషన్ సంబరంగా ప్రారంభమైంది. న్యూఢిల్లీలోని భారత మండపం, ద్వారకలోని యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఢిల్లీ అండ్ ఇండియా ఎక్స్‌పో సెంటర్ అండ్ మార్ట్‌ల్లో సమాంతరంగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. భారత మండపంలోని ఎక్స్‌పోను శనివారం కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, హెచ్‌డి కుమారస్వామి, జితన్ రామ్ మంఝీ, మనోహర్ లాల్, పియూష్ గోయల్, హర్దీప్ సింగ్ పూరితో కలిసి ప్రధాని నరేంద్ర మోడీ లాంచనంగా ప్రారంభించారు. జనవరి 22వ తేది వరకు జరగనున్న ఈ ప్రదర్శనలో వివిధ కంపెనీలు దాదాపు 100 కొత్త కార్లను ఆవిష్కరించనున్నాయి. వాహన తయారీదారుల నుంచి ఆటోమొబైల్ విడిభాగాలు, ఎలక్ట్రానిక్ విడిభాగాలు, టైర్లు, ఇంధన స్టోరేజీ వ్యవస్థల తయారీదారులు, ఆటోమొబైల్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు, మెటీరియల్ రీసైక్లింగ్ చేసే సంస్థల వరకు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి.

ఇటీవల మరణించిన టాటా సన్స్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా, సుజుకి మోటార్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఒసము సుజుకి భారత ఆటోమొబైల్ రంగానికి విశేష సేవలను అందించారని ప్రధానీ గుర్తు చేసుకున్నారు. దేశంలో ఈ రంగం వృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. దేశంలో పెరుగుతున్న మధ్యతరగతి, పట్టణీకరణ వేగవంతం, మౌలిక వసతుల అభివృద్ధి, మేక్ ఇన్ ఇండియా వాహనాలు ప్రధానంగా ఆటో రంగ వృద్ధికి మద్దతును ఇవ్వనున్నాయన్నారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారులు, మౌలిక వసతుల కోసం రూ.11లక్షల కోట్ల వ్యయం చేసిందన్నారు. 5,100 జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు పాల్గొంటాయని అంచనా. ఈ ప్రదర్శనను భారత్ సహా ప్రపంచ దేశాలకు చెందిన 5 లక్షల మంది సందర్శించే అవకాశం ఉంది. పరికరాల ప్రదర్శనలో 60 కొత్త ఉత్పత్తుల ఆవిష్కరణలు జరగనున్నాయి.

### టాటా మోటార్స్ కొత్త మోడళ్ల ఆవిష్కరణ




భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో టాటా మోటార్స్ పలు కొత్త మోడళ్లను ప్రదర్శించింది. వీటిలో హరియర్ ఇవి, అవిన్య ఎక్స్ కాన్సెప్ట్, న్యూ సియోర వాహనాలున్నాయి. కొత్త ఎస్‌యువి సియోరా ఐసిఇ కంబ్యూషన్ ఇంజిన్, ఎలక్ట్రిక్ వర్షన్‌లోనూ రానుందని ఆ కంపెనీ తెలిపింది. వీటి ఆవిష్కరణకు టాటా సన్స్ చంద్రశేఖరన్ హాజరయ్యారు. టాటా హరియర్ ఇవి తొలి మిడ్ సైజ్ ఎలక్ట్రిక్ ఎస్‌యువి అని ఆ కంపెనీ తెలిపింది. అవిన్యా ఎక్స్ కాన్సెప్ట్ ప్రీమియం ఇవి మోడల్ అని తెలిపింది. ఇది 2026 నుంచి అందుబాటులోకి రానుందని ఆ కంపెనీ తెలిపింది.

### అమేజాన్ నుండి తయారైన బాక్సలతో బెడ్స్ కేటాయింపులో మహా కుంభ మేళాతో అమేజాన్ ఒప్పందం

**నవతెలంగాణ-హైదరాబాద్ :** ప్రతి 12 ఏళ్లకు ఒకసారి జరిగే 2025 మహా కుంభ మేళాలో సందర్శకుల అనుభవాన్ని మెరుగుపరచడానికి, వినూత్నమైన ఆలోచనతో సమస్యను నిర్వహించడానికి అమేజాన్ ఇండియా సిద్ధమైంది. జనవరి మరియు ఫిబ్రవరిలలో, లక్షలాది భక్తులు ఈ 45 రోజుల పండగ కోసం ప్రయాగ్ రాజ్, ఉత్తర్ ప్రదేశ్ ను సందర్శిస్తారు. ఈ కార్యక్రమంలో జరిగే సమయంలో సౌకర్యవంతమైన విశ్రాంతి కోసం అమేజాన్ ఇండియా విలక్షణమైన చొరవను ప్రారంభించింది, దీనిలో భాగంగా తమ సిగ్నేచర్ కార్డ్ బోర్డ్ ప్యాకేజింగ్ బాక్స్ లను పొందికైన బెడ్స్ గా మారుస్తాయి, మేళాకు హాజరైన వారికి ఎన్నో గంటల సౌకర్యవంతమైన నిద్రను కలగచేస్తాయి. అందరికీ అందుబాటులో ఉండే విధంగా వీటిని సందర్శకులకు ఉచితంగా అందచేస్తున్నారు.

### ఇంటిగ్రేటెడ్ లా ప్రోగ్రామ్‌కు అడ్మిషన్లను ప్రకటించిన చెన్నై శివ్ నాడార్ విశ్వవిద్యాలయం

**నవతెలంగాణ-హైదరాబాద్ :** చెన్నైలోని శివ్ నాడార్ విశ్వవిద్యాలయం 2024లో శివ్ నాడార్ స్కూల్ ఆఫ్ లాను ప్రారంభించగా, ఇప్పుడు 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటిగ్రేటెడ్ బి.ఎ., ఎల్.ఎల్.బి. ప్రోగ్రామ్ రెండవ ఇన్‌కమింగ్ బ్యాచ్ కోసం దరఖాస్తులను స్వీకరిస్తోంది. నైతిక, ప్రపంచవ్యాప్తంగా సమర్థులైన, సామాజికంగా బాధ్యతాయుతమైన న్యాయ నిపుణులను పెంపొందించడంపై దృష్టి సారించిన ఈ కార్యక్రమం ట్రూ-బ్లూ లిబరల్ ఆర్ట్స్ ప్రోగ్రామ్‌ను చట్టపరమైన నైపుణ్యాలపై దృష్టి సారించే ప్రత్యేకమైన బోధనతో మిళితం చేస్తుంది. దరఖాస్తులను apply.snuchennaiadmissions.comలో ఆన్‌లైన్‌లో దాఖలు చేయవచ్చు.

### బిఎండబ్ల్యు నుంచి కొత్త ఇవి



ప్రముఖ లగ్జరీ కార్ల తయారీ కంపెనీ బిఎండబ్ల్యు కొత్తగా ఎస్‌యువిలో బిఎండబ్ల్యు ఎక్స్1 ఇవిని ఆవిష్కరించింది. దేశంలో తయారు చేసిన తమ తొలి విద్యుత్ వాహనమని బిఎండబ్ల్యు గ్రూప్ ఇండియా సిఇఒ విక్రమ్ పాహ్ తెలిపారు. దీని ప్రారంభ ధరను రూ. 49,00,000 లక్షలుగా నిర్ణయించింది.

### సింపోజియం, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమాలతో ఏఐలో స్థిరత్వాన్ని అభివృద్ధి చేస్తోన్న KLH బాచుపల్లి

**నవతెలంగాణ-హైదరాబాద్ :** నేటి శక్తివంతమైన ప్రొఫెషనల్ ప్రపంచంలో రాణించడానికి అవసరమైన కీలకమైన నైపుణ్యాలు మరియు జ్ఞానంతో విద్యార్థులను సన్నద్ధం చేయడం లక్ష్యంగా KLH బాచుపల్లి క్యాంపస్ ఇటీవల ఆకర్షణీయమైన వర్క్‌షాప్‌లు మరియు నాయకత్వ అభివృద్ధి సెషన్‌ల శ్రేణిని నిర్వహించింది. ఈ కార్యక్రమాలు, అభ్యాస అనుభవాన్ని మెరుగుపరచడం మరియు విద్యార్థులు వారి సంబంధిత రంగాలలో భవిష్యత్ ఆవిష్కర్తలు మరియు నాయకులుగా మారడానికి సిద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

## లేని భూమి కోసం 65 ఏండ్లకుపైగా న్యాయ పోరాటం

### ఆస్మాన్ జాహి పైగా భూములపై పిటిషన్లు మూసేసిన హైకోర్టు | 1958 నుంచి జరుగుతున్న లిటిగేషన్‌కు తెర



**నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్**

క్షేత్ర స్థాయిలో లేని భూమి కోసం ఆస్మాన్ జాహి పైగా వారసులు, వారి నుంచి భూమిని కొనుగోలు చేసిన వారు గత 66 ఏండ్లుగా న్యాయపోరాటంపై హైకోర్టు తీర్పు వెలువరించింది. రాజీ విధానంలో భాగస్వామ్య పరిష్కారం చేసుకోవాలనే నిర్ణయానికి కక్షిదారులు వచ్చినప్పటికీ అసలు అక్కడ భూమే లేదని హైకోర్టు వెల్లడించింది. భూమే లేనప్పుడు భాగస్వామ్య పరిష్కారమనే అంశమే ఉత్పన్నం కాబోదని తేల్చి చెప్పింది. 25 గ్రామాల్లో భౌతికంగా ఉనికిలోలేని భూముల కోసం ఆస్మాన్ జాహి పైగా వారసులు, వారి నుంచి కొనుగోలు చేసినవారు 66 ఏళ్లుగా న్యాయపోరాటం చేయడంపై హైకోర్టు ఆ విధమైన తుది నిర్ణయానికి వచ్చింది. కమిషనర్ ఆఫ్ సెటిల్మెంట్ సర్వే 1977లో ఇచ్చిన నివేదికను తోసిపుచ్చుతున్నట్టు వెల్లడించింది. 2022లో నియమితులైన కమిషనర్ కమ్ కోర్టు రిసీవర్ సమర్పించిన రిపోర్టు ప్రకారం ఆయా గ్రామాల్లో పిటిషనర్లు చెబుతున్న భూములు లేవని గుర్తు చేసింది. లేని భూముల కోసం ఇనేళ్లుగా లిటిగేషన్ కొనసాగడంపై విస్మయాన్ని వ్యక్తం చేసింది. క్షేత్ర స్థాయిలో భూములే లేనప్పుడు వాటిపై 66 ఏళ్ల క్రితం అంటే 1958 ఏడాది నాటి కేసులో విచారణ కొనసాగింపు అవసరం లేదని వెల్లడించింది. పిటిషన్‌పై విచారణను మూసేస్తున్నట్టు ప్రకటించింది. 1977 ఏడాదిలో కమిషనర్ ఆఫ్ సెటిల్మెంట్ సర్వే రిపోర్టు మేరకు జారీ చేసిన ఫైనల్ డిక్రీ చెల్లదని చీఫ్ జస్టిస్ ఆలోక్ ఆరాధే, జస్టిస్ ఎస్ వి శ్రవణ్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల తీర్పు చెప్పింది.

**ఏం జరిగిందంటే..**

నవాబ్ మొయిన్-దౌలా బహదూర్, అస్మాన్ జహ్ బహదూర్‌ల చట్టపరమైన వారసుల్లో, కుటుంబ మాతృక ఆస్తులపై రాయదుర్గ్, షంషిగుడాల్లో అనేక మక్తాలు ఉన్నాయి. మాతక అస్తులకు సంబంధించి భాగపరిష్కారానికి సుల్తానా జహాన్ బేగం 1953లో సిటీ సివిల్ కోర్టులో కేసు వేశారు. ఆ తర్వాత ఈ వివాదం 1958లో హైకోర్టుకు చేరింది. రాజీ డిక్రీ ద్వారా 1950 ఏప్రిల్‌లో ప్రిలిమనరీ డిక్రీ జారీ కూడా వెలువడింది. ప్రిలిమినరీ డిక్రీ అమలు చేయాలని కోరుతూ రాజా కిషన్‌దాస్, నవాబ్ సలీం ఖాన్‌లు కమిషనర్/ రిసీవర్లుగా నియమితులయ్యారు. 1959 ఏప్రిల్ 6న ప్రిలిమినరీ డిక్రీ జారీ సూట్‌లోని ఆస్తుల వ్యవహారాలను పరిశీలించేందుకు కమిషనర్ల నియామకం జరిగింది. ఏడాదికి పొడిగిస్తూ వచ్చారు. 230 నుంచి 254 వరకు 25 గ్రామాల్లోని సుమారు 320 ఎకరాల అస్తులు రెవెన్యూ శాఖ వివాదంలో ఉన్నాయి. ఇవి ప్రభుత్వం నుంచి విడుదలై ఆస్మాన్ జాహి పైగాకు చెందినప్పుడు వాటిని రిసీవర్లు తమ భాగాలను పంపిణీ చేయాలన్నది రాజీ డిక్రీ సారాంశం. దీనిపై దాఖలైన పిటిషన్‌లో 1968 నుంచి ఒకటి తర్వాత మరొకటి చొప్పుడు అప్లికేషన్లు దాఖలౌతూ వచ్చాయి. దీనిపై ప్రాదమిక డిక్రీ ఆధారంగా తుది డిక్రీ జారీకి 2012 డిసెంబరు 20న జిల్లా మాజీ జడ్జీలు మహ్మద్ బాండే అలి, కె.అజిత్ సింహారావులను రిసీవర్ కమ్ కమిషనర్స్‌గా హైకోర్టు నియమించింది. నివేదిక సమర్పించాలన్న ఆదేశాల మేరకు 2023 జులై 6వ తేదీన కమిషనర్ సమర్పించిన నివేదికలో అందుబాటులో ఉన్న భూముల పంపిణీ జరిగిందనీ, 230 నుంచి 251 వరకు ఉన్న 25 మక్తాల భూములు ప్రభుత్వం నుంచి విడుదల కాలేదని పేర్కొన్నారు. 1977 నాటి రిసీవర్ నివేదిక మేరకు రాయదుర్గ్ పైగా, షంషీగూడ పైగా గ్రామాల భూములకు తుది డిక్రీ జారీ అయినట్టు కూడా పేర్కొన్నారు. వాస్తవాలను పరిశీలించకుండా నివేదిక జారీ అయ్యిందన్నారు.

**వాదప్రతివాదనలు**

1977 నివేదిక ఆధారంగా ఫైసల్ డిగ్రీ జారీ అయిందనీ, ఆస్మాన్ జాహి వారసుల నుంచి భూములు కొనుగోలు చేశామనీ, వాటిని తమకు అప్పగించాలని కోరుతూ ఇతరులు కూడా పిటిషన్లు వేశారు. సీసీఎల్‌ఏ ప్రొసీడింగ్స్, కోర్టు ఉత్తర్వులను పరిశీలించకుండా రిసీవర్ సమర్పించిన నివేదిక చెల్లదన్నారు. రిసీవర్ నివేదిక ఆధారంగా హైకోర్టు, సుప్రీం కోర్టుల తీర్పులు చెల్లవనడం సబబు కాదన్నారు. ప్రిలిమనరీ డిక్రీలో పేర్కొన్న ప్రకారం ఆస్తులను భాగ పరిష్కారం చేయాలే గానీ పరిధిని అతిక్రమించి రిసీవర్ భూములు లేవనడం చెల్లదన్నారు. ప్రభుత్వం తరపున అదనపు అడ్వొకేట్ జనరల్ ప్రతివాదన చేస్తూ జాగీర్ రద్దు అయినందున భూములన్నీ ప్రభుత్వానివేనని చెప్పారు. కొందరు మోసపూరితంగా భూముల్ని పొందాలనే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు.

**లేని భూమి కోసం 66 ఏళ్లుగా లిటిగేషన్**

వాదనల అనంతరం హైకోర్టు, 1959 ఏప్రిల్ 8న ప్రాథమిక డిక్రీలోని 230 నుంచి 254 వరకు ఆస్మాల్ జాహి పైగాకు అనుకూలంగా విడుదల చేసినట్టు లేదని తేల్చింది. కమిషనర్ ఆఫ్ సెటిల్మెంట్ సర్వే మక్తా భూములను రిలీజ్ చేస్తూ 1977 డిసెంబరు 30న ఇచ్చిన ఉత్తర్వులు ఉన్నాయని పిటిషనర్లు చెబుతున్నప్పటికీ, 230 నుంచి 251 వరకు విస్తీర్ణం ఎంతో చెప్పలేదని ఆక్షేపించింది. 1977 నివేదిక ద్వారా విడుదలైందనే పిటిషనర్ల వాదనలకు అనుగుణంగా ఆధారాలు చూపలేదని తప్పుపట్టింది. నిజంగానే 1977లో విడుదలైతే భూముల్ని ఎందుకు స్వాధీనం చేసుకోలేదో పిటిషనర్ల నుంచి వివరణ లేదని పేర్కొంది. ప్రభుత్వం నుంచి భూములు విడుదలైతేనే భాగ పరిష్కారానికి ఆస్కారం ఉంటుందనీ, ఇక్కడి కేసులో ప్రభుత్వం నుంచి భూమి విడుదల కానప్పుడు భాగ పరిష్కారానికి తావే ఉండదని స్పష్టం చేసింది. ఉనికిలో లేని భూముల కోసం 66 ఏళ్లుగా లిటిగేషన్‌ను కొనసాగించారని వ్యాఖ్యానించింది. కక్షిదారులకు చట్టప్రకారం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు సీఎస్ 7/1958 పిటిషన్‌పై విచారణను మూసేస్తున్నట్టు తీర్పులో పేర్కొంది.

### బతుకమ్మకుంట భూమి వివాదంలో జోక్యానికి హైకోర్టు నిరాకరణ

**సివిల్ కోర్టులో తేల్చుకోవాలని సూచన**

హైదరాబాద్, బాగ్ అంబర్‌పేటలోని ఏడు ఎకరాలు బతుకమ్మకుంట భూమి అంటున్నది వాస్తవం కాదనీ, అది మైదాన భూమనీ, తనదేనని పేర్కొంటూ ఆదే ప్రాంతానికి చెందిన సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ నెల మొదటి వారంలో సింగిల్ జడ్జి కూడా ఆయన పిటిషన్‌ను కొట్టేశారు. భూమికి చెందిన ఆధారాలు, రెవెన్యూ రికార్డుల్లో పేర్లు వంటివి చూపలేదనీ, అయినా సివిల్ వివాదంపై సివిల్ కోర్టును ఆశ్రయించాలనీ, నేరుగా హైకోర్టులో పిటిషన్ వేయడానికి వీల్లేదని తీర్పు చెప్పారు. దీనిపై అప్పీల్ పిటిషన్ వేయగా, సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకోలేమని ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాథే ఆధ్వర్యంలోని ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పింది

## వేగంగా కోలుకుంటున్నారు

● సైఫ్ అలీ ఖాన్ ఆరోగ్యంపై డాక్టర్లు

● దాడి వెనుక ఏ అండర్ వరల్డ్ ముఠా లేదు దొంగతనమే లక్ష్యమన్న మహారాష్ట్ర మంత్రి



**ముంబయి :** గురువారం తన ఇంట్లో దుండగుడి కత్తిపోట్లకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీ ఖాన్ ఆరోగ్యం ప్రస్తుతం బాగుందని, చాలా వేగంగా కోలుకుంటున్నారని డాక్టర్లు శుక్రవారం తెలిపారు. రెండు మూడు రోజుల్లో ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ చేసే అవకాశం వుందని చెప్పారు. ఆయన ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు డాక్టర్ల బృందం నిశితంగా పర్యవేక్షిస్తున్నందని, తాము అనుకున్నట్లుగానే ఆయన చాలా వేగంగా కోలుకుంటున్నారని ఇదే పరిస్థితి కొనసాగితే త్వరలోనే ఇంటికి పంపించేస్తామని లీలావతి ఆస్పత్రి న్యూరోసర్జన్ డాక్టర్ నితిన్ డాంగే తెలిపారు. ఇంటెన్సివ్ కేర్ నుంచి ఆయనకు స్పెషల్ రూమ్‌కు కూడా తరలించినట్టు చెప్పారు. చేతిపై, మెడపై, వెనుక వెన్నెముకపై మూడు గాయాలయ్యాయని చెప్పారు. మరో 2 మి.మీ లోతుకు కత్తి వెళ్లి వున్నట్లైతే ఇంకా తీవ్రంగా గాయమయ్యేదని, అప్పుడు పరిస్థితి కొంచెం క్లిష్టమయ్యేదని డాక్టర్ వ్యాఖ్యానించారు. కాసేపు నడిపించామని, ఆయన కూడా నడవడానికి సౌకర్యంగానే ఫీలయ్యారని చెప్పారు. అయితే ఆయన బెడ్‌రెస్ట్‌లో వుండడం మంచిదని సూచించినట్లు చెప్పారు. అందుకే సందర్శకులపై కూడా ఆంక్షలు పెట్టినట్లు చెప్పారు.

**ముందుగానే ఇంట్లో నక్కాడా ?**

సైఫ్ ఇంట్లో దొంగతనానికి వచ్చిన వ్యక్తి తనకు కోటి రూపాయిలు కావాలన్నాడని ఇంట్లో వుండే ఆయా ఎలియమ్మా ఫిలిప్ పోలీసులకు తెలిపారు. అగంతకుడు బలవంతంగా ఇంట్లోకి చొరబడినట్లు కనిపించలేదని బహుశా దొంగతనం కోసమే అంతకుముందే ఇంట్లోకి చొరబడి దాక్కుని వుండవచ్చని భావిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సైఫ్ రెండో కొడుకు జహంగీర్‌ను పడుకోబెట్టి ఆ రూమ్‌లోనే తానూ పడుకున్నానని, రాత్రి 2గంటల సమయంలో శబ్దాలు వినిపించాయని, నిద్రపోతున్న పిల్లాడి వద్దకు ఒక వ్యక్తి రావడంకనిపించిందని, వెంటనే భయంతో పెద్దగా కేకలు వేశానని, పిల్లాడిని గట్టిగా పట్టుకుని ఆ వ్యక్తిని అవతలకు నెట్టివేశానని ఆయా చెప్పారు.

**ఏ అండర్ వరల్డ్ ముఠా కుట్ర లేదు**

ఈ దాడి వెనుక ఏ అండర్ వరల్డ్ ముఠా కుట్ర లేదని, కేవలం దొంగతనానికి పాల్పడాలన్న ఉద్దేశ్యంతోనే ఇదంతా జరిగిందని మహారాష్ట్ర మంత్రి యోగేష్ కదమ్ తెలిపారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో వున్న అనుమానితుడు కూడా ఏ ముఠాకు చెందిన వాడు కాదన్నారు. ప్రాథమిక విచారణలో ఈ విషయాలు తేలాయంటూ పూనేలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తనకు బెదిరింపులు వస్తున్నాయని సైఫ్ కూడా ఇంతవరకు ఎలాంటి సమాచారం పోలీసులకు ఇవ్వలేదని చెప్పారు.

### చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి స్టాల్ కేటాయింపు




**నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో**


చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్' స్టాల్, ట్రాలీ స్టాండ్‌ను కేటాయించినట్టు దక్షిణ మధ్య రైల్వే శుక్రవారంనాడొక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఈ స్టాల్‌ను ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి చెందిన వ్యక్తులు నిర్వహిస్తారనీ, స్నాక్స్, జూట్ బ్యాగ్‌లు, సబ్బులు సహా చేతితో తయారు చేసిన పలు ఉత్పత్తులను వీరు విక్రయిస్తారని వివరించారు. ట్రాన్స్‌జెండర్ ఎంటర్‌ప్రెన్యూర్ జాస్మిన్ ఈ స్టాల్‌ను ప్రారంభించారు. దీనివల్ల తమ కమ్యూనిటీకి ఆత్మవిశ్వాసం, స్వయం శక్తి పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. అన్ని వర్గాల వారికి సమాన అవకాశాలు లభించడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్‌జైన్ అన్నారు. ప్రయాణీకుల అవసరాలకు ఈ స్టాల్ ఉపయోగపడుతుందని చెప్పారు.

## ఢిల్లీ ఓటర్ల జాబితాలో అవకతవకలపై దర్యాప్తు చేపట్టాలి

### ఎన్నికల కమిషన్‌కు మాజీ ప్రభుత్వ కార్యదర్శి ఈఏఎస్ శర్మ లేఖ



**న్యూఢిల్లీ :** ఢిల్లీలో ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆరోపణలు చేసిన నేపథ్యంలో వాటిపై అత్యవసరంగా దర్యాప్తు జరపాలని ప్రభుత్వ మాజీ కార్యదర్శి, సామాజిక కార్యకర్త ఈఏఎస్ శర్మ కోరారు. ఈ మేరకు ఆయన ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు ఒక లేఖ రాశారు. దర్యాప్తు వల్ల మాత్రమే ఇటువంటి ఆరోపణల వెనుక గల వాస్తవాలు బయటపడతాయని అన్నారు. ఇటువంటి అవకతవకలు ఏమైనా జరిగాయంటే ఎన్నికల కమిషన్‌పై ప్రజలు పెట్టుకున్న విశ్వాసాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమే అవుతుందని ఆ లేఖలో శర్మ పేర్కొన్నారు. ఆప్ చేసిన ఆరోపణలను ఎన్నికల కమిషన్ ఇప్పటికే కొట్టిపారేసింది. ఆప్ నేత సంజయ్ సింగ్ వెల్లడించిన సమాచారంలో ఏదైనా నిజముందని తేలినట్లైతే, అందుకు బాధ్యులైన వారిపై సంబంధిత ఎన్నికల చట్టాలు, భారత న్యాయ సంహిత నిబంధనల కింద కచ్చితంగా చర్యలు తీసుకోవాల్సి వుందని శర్మ పేర్కొన్నారు. ఆప్ నేత, ఎంపీ సంజయ్ సింగ్ నాలుగు రోజుల క్రితం ఈ ఆరోపణలు చేశారు. ప్రజా జీవితంలో బాధ్యతాయుతమైన స్థానాల్లో వున్న అనేకమంది, మరికొందరి ప్రోద్బలంతో ఢిల్లీ ఓటర్ల జాబితాలో అనేక ఎంట్రీలను తప్పుగా చేర్చారని సంజయ్ సింగ్ ఆరోపించారు. ఇలా పట్టుబట్టి చేర్పించిన వారందరూ కూడా ఒకే పార్టీ బీజేపీకి చెందినవారని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలు తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నాయని శర్మ ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు అవకతవకలు, అవినీతి చోటు చేసుకోవడం నిజమేనని నిర్ధారించబడినట్లైతే మన ఎన్నికల వ్యవస్థపై అది తీవ్రమైన ప్రభావం చూపుతుందని శర్మ పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణా బాధ్యతలు చూసే అందరి విశ్వసనీయత దెబ్బతింటుందన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వచ్చే నెలలో పదవీ విరమణ చేయనున్నారని తెలిసిందని, ఆయన రిటైరైన తర్వాత కొన్ని నెలల పాటు హిమాలయాల్లో గడపాలని, తనను తాను పరిశుద్ధుడిని (డీ టాక్సిఫై) చేసుకోవాలని భావిస్తున్నట్లు ఒక వార్తను తాను చదివానని శర్మ ఈ సందర్భంగా ఆ లేఖలో గుర్తు చేసుకున్నారు. ఆయన అలా చేయాలనుకోవడాన్ని తాను స్వాగతిస్తానన్నారు. సంజయ్ సింగ్ చేసిన ఆరోపణలపై ఎన్నికల కమిషన్ ఇప్పటికే కూలంకషంగా దర్యాప్తునకు ఆదేశించి వుంటుందని భావిస్తున్నట్లు శర్మ పేర్కొన్నారు. అలా జరగకపోతే ఎన్నికల కమిషన్ విశ్వసనీయతతో పాటు ఆ కార్యాలయంలో పనిచేసే సీనియర్ అధికారులందరి విశ్వసనీయత కూడా దెబ్బతింటుందని శర్మ పేర్కొన్నారు. ఎంతకైనా తెగించి ఎన్నికల్లో గెలుపొందాలనుకునే పార్టీకి ఎన్నికల్లో పాల్గొనే బృహత్తర బాధ్యతను అప్పగించరాదని వ్యాఖ్యానించారు. ఒకవేళ ఎవరైనా ఇలాంటి అవకతవకలకు పాల్పడినా వారిని ఉపేక్షిస్తున్నామంటే ఎన్నికల కమిషన్ వ్యవస్థపై ప్రజలు పెట్టుకున్న విశ్వాసాన్ని ఉల్లంఘించినట్లే అవుతుందని శర్మ తన లేఖలో స్పష్టం చేశారు.



### ప్రజల దృష్టిని మళ్లించేందుకే రైతు దీక్ష

● బీఆర్ఎస్‌పై జీవన్‌రెడ్డి ఫైర్

**నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసాను అమలు చేయనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ రాజకీయ ఎత్తుగడలు వేస్తున్నదని ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఆ పార్టీ నేతలు రైతు దీక్ష చేపడుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. మాజీ మంత్రి కేటీఆర్ ఒకవైపు విచారణ ఎదుర్కొంటూనే...ఇంకోవైపు జడ్జి దగ్గరకు విచరణకు సిద్ధం అంటున్నారని ఎద్దేవా చేశారు. తమ దీక్ష వల్లే ప్రభుత్వం రైతు భరోసా ఇచ్చిందని చెప్పుకునేందుకు ఆ పార్టీ నేతలు తాపత్రాయపడుతున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ రైతు రుణమాఫీ గురించి మాట్లాడలేదని గుర్తు చేశారు.

ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రి కేటీఆర్ ఈడీ విచారణానంతరం అడ్డగోలు ఆరోపణలు చేశారని తెలిపారు. కేటీఆర్ చేసిన తప్పులు బయటపడుతుంటే, అక్కసుతో సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కక్షపూరితంగా రేవంత్‌పై ఎన్ని కేసులు పెట్టిన ఆయన ధైర్యంగా ఎదుర్కొన్నారే తప్ప కేటీఆర్‌లా భయపడలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా కేటీఆర్ తన తీరు మార్చుకుని, విచారణకు సహకరించాలని ఆయన సూచించారు.

## పెరిగిన రష్యా చమురు ఉత్పత్తులు

### ఏడాదిలోనే అత్యధిక స్థాయికి ● బ్లూమ్‌బెర్గ్ వెల్లడి




**మాస్కో :** గత వారం అమెరికా.. రష్యా ఇంధన రంగంపై కొత్త ఆంక్షలు విధించినప్పటికీ శుద్ధి చేసిన రష్యా ఇంధన ఎగుమతులు దాదాపు ఒక సంవత్సరంలో అత్యధిక స్థాయికి చేరుకున్నాయని బ్లూమ్‌బెర్గ్ వార్తా సంస్థ వివరించింది. జనవరి మొదటి పది రోజుల్లో రష్యా పెట్రోలియం ఉత్పత్తుల సముద్ర రవాణా 11 నెలల గరిష్ట స్థాయికి చేరుకుందనీ, అది సగటున రోజుకు 2.5 మిలియన్ బ్యారెళ్లు (బీపీడీ) అని విశ్లేషణ సంస్థ వోర్టెక్సా డేటాను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ పేర్కొన్నది. డిసెంబర్ రోజువారీ సగటుతో పోలిస్తే ఈ పెరుగుదల 12 శాతంగా ఉందనీ, గతేడాది ఫిబ్రవరి తర్వాత ఇది అత్యధిక స్థాయిని సూచిస్తుందని సదరు వార్తా సంస్థ వివరించింది.బ్రిటన్‌తో సమన్వయం చేసుకుని అమెరికా గత వారం రష్యాపై సరికొత్త ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు రష్యాలోని ప్రధాన చమురు కంపెనీలైన గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సుర్గుట్నెఫ్టెగాస్‌లను, అలాగే పాశ్చాత్య ఆంక్షలను ధిక్కరించి రష్యన్ చమురును రవాణా చేయడానికి ఉపయోగించిన డజన్ల కొద్దీ నౌకలను (వీటిని అమెరికా 'షాడో ఫ్లీట్'గా అభివర్ణించింది) లక్ష్యంగా చేసుకున్నాయి.

ఈ ఆంక్షలను రష్యా ఖండించింది. వాటిని 'చట్టవిరుద్ధం' అని పేర్కొన్నది. క్రెమ్లిన్ ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ ఇవి ప్రపంచ ఇంధన మార్కెట్లను అస్థిరపరచవచ్చని హెచ్చరించారు. తాజా రౌండ్ ఆంక్షలు రష్యన్ వాణిజ్యంలో పాల్గొన్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న 180 కంటే ఎక్కువ ట్యాంకర్లను లక్ష్యంగా చేసుకున్నాయి. ప్రధానంగా ముడి చమురు రవాణాపై దృష్టి సారించాయి. అయితే, జనవరి 1 నుంచి 10 మధ్య ఎగుమతి చేయబడిన పెట్రోలియం ఉత్పత్తులలో కేవలం నాలుగు శాతం మాత్రమే ఆంక్షలు విధించబడిన ట్యాంకర్ల ద్వారా రవాణా చేయబడ్డాయని వోర్టెక్సా డేటాలో రికార్డ్ అయింది. ఇంతకు మించి ఈ నౌకల ప్రయాణాలలో ఎటువంటి విచలనం జరగలేదని బ్లూమ్‌బెర్గ్ వివరించింది.

రష్యా పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల్లో ఇటీవలి పెరుగుదల ప్రధానంగా డీజిల్, ఇంధన చమురు ఎగుమతుల పెరుగుదల కారణంగా ఏర్పడిందని బ్లూమ్‌బెర్గ్ పేర్కొన్నది. డిసెంబర్‌లో ఇంధన ఎగుమతుల నుంచి వచ్చే ఆదాయాలు ముడి చమురు ఆదాయాల క్షీణతను మించిపోయాయనీ, దీనికి పెరుగుతున్న గ్యాసోలిన్ ప్రవాహాలు, మార్కెట్‌లో వాటి ధరల పెరుగుదల కారణమని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఏ)ను ఉటంకిస్తూ బ్లూమ్‌బెర్గ్ చెప్పింది. రష్యా శుద్ధి చేసిన ఇంధన ఎగుమతుల్లో దాదాపు 40 శాతం ఉన్న డీజిల్, గ్యాసోలిన్ ఎగుమతులు డిసెంబర్ స్థాయిల నుంచి 17 శాతం పెరిగి 1.08 మిలియన్ బీపీడీలకు చేరుకున్నాయి. ఇది గత ఫిబ్రవరి తర్వాత అత్యధికం. బాల్టిక్ ఓడరేవుల నుంచి వచ్చే ఎగుమతులు 50 శాతానికి పైగా పెరిగాయి. ఇది వృద్ధికి దోహదపడిందని డేటా చూపించింది. ఇంధన చమురు ప్రవాహాలు కూడా పెరిగాయి. అవి 792,000 బీపీడీలకు చేరుకున్నాయి. ఇది 19 శాతం పెరిగి, జులై, 2023 తర్వాత అత్యధిక స్థాయికి చేరుకున్నది. ఆఫ్రికాకు ఎగుమతి అయిన రష్యా చమురు ఉత్పత్తులు అత్యంత గణనీయమైన పెరుగుదలను చూశాయి.

## అల్ ఖదీర్ ట్రస్టు కేసులో ఇమ్రాన్ దంపతులకు జైలు

### న్యాయవ్యవస్థ ప్రతిష్ట దిగజారిందన్న పిటిఐ నేత


**ఇస్లామాబాద్ :** దాదాపు 19 కోట్ల పౌండ్లకు పైగా అవినీతి చోటు చేసుకుందన్న అల్ ఖదీర్ ట్రస్టు కేసులో పాకిస్తాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలను పాకిస్తాన్ కోర్టు దోషులుగా నిర్ధారించింది. వారిరువురికి వరుసగా 14 ఏళ్ళ, ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. వివిధ కారణాల వల్ల ఇప్పటివరకు ఈ కేసులో తీర్పును మూడుసార్లు వాయిదా వేస్తూ వచ్చారు. శుక్రవారం అవినీతి నిరోధక న్యాయస్థానం న్యాయమూర్తి నాజిర్ జావేద్ రాణా తీర్పు చెబుతూ జైలుశిక్షలతో పాట్లు ఖాన్‌కు 10 లక్షల రూపాయలు, బుష్రా బీబీకి 5లక్షల రూపాయలు జరిమానా విధించారు. జరిమానా చెల్లించడంలో విఫలమైతే మరో ఆరుమాసాలు ఖాన్, మరో మూడు మాసాలు బీబీ అదనంగా జైలుశిక్షను అనుభవించాల్సి వుంటుంది. వారు ఏర్పాటు చేసిన అల్ ఖదీర్ యూనివర్శిటీ భూమిని జప్తు చేసుకోవాల్సిందిగా కూడా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఖాన్ ఇప్పటికే జైల్లో వుండగా, బుష్రాను కోర్టులోనే అరెస్టు చేశారు. ఈనాటి తీర్పుతో దేశంలో న్యాయ వ్యవస్థ ప్రతిష్ట దిగజారిందని ఖాన్ విమర్శించారు. తాను లాభపడింది లేదని, ప్రభుత్వం కోల్పోయింది లేదని వ్యాఖ్యానించారు. ఖాన్, బీబీలతోపాటు మరో ఆరుగురిపై నేషనల్ అక్కౌంటబిలిటీ బ్యూరో కేసు దాఖలు చేయగా, మిగిలిన వారందరూ దేశం వీడి వెళ్లడంతో వీరిద్దరిపైనే విచారణ జరిగింది. ఈ కేసులో దేశ ఖజానాకు ఐదు వేల కోట్ల రూపాయలు (19 కోట్ల పౌండ్లు) నష్టం జరిగిందని అకౌంటబిలిటీ బ్యూరో నేరాభియోగాన్ని మోపింది.

### 3వ ఎడిషన్‌తో తిరిగి వచ్చిన మ్యూజిక్ ఫెస్టివల్ -రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్



**నవతెలంగాణ-హైదరాబాద్ :** సమకాలీన హిప్-హాప్ బీట్స్ తో బాలీవుడ్ లో ప్రసిద్ధి చెందిన శ్రావ్యమైన గీతాలను మిశ్రమం చేసిన తమ మూడవ ఎడిషన్ కోసం సీగ్రమ్ రాయల్ స్టాగ్ బూమ్ బాక్స్ మళ్లీ వచ్చింది. ఈ సీజన్ ను మిర్చి తయారు చేస్తుండటంతో, ఈ లీనమయ్యే మ్యూజిక్ ఫెస్టివల్ జనవరి 14, 2025న ముంబైలో జరిగిన ప్రత్యేక మీడియా ప్రివ్యూలో రాబోతున్న శ్రేణిని ప్రదర్శించింది. ఈ విలక్షణమైన సాంస్కృతిక కలయిక సంప్రదాయబద్ధమైన మరియు ఆధునిక భారతదేశపు సంగీతం యొక్క కూడలిని పునర్నిర్వచించడం కొనసాగించింది, బ్రాండ్ యొక్క 'లివింగ్ ఇట్ లార్జ్ లీ' సిద్ధాంతానికి చిహ్నంగా నిలిచింది.

### 26న అహ్మదాబాద్‌లో కోల్డ్‌ప్లే ప్రత్యక్ష ప్రదర్శనను ప్రసారం చేయనున్న డిస్నీ+హాట్‌స్టార్




**నవతెలంగాణ-హైదరాబాద్ :** కోల్డ్‌ప్లేతో కలిసి వారి ఐకానిక్ మ్యూజిక్ ఆఫ్ ది స్పియర్స్ వరల్డ్ టూర్ కచేరీని భారతదేశం అంతటా ప్రేక్షకులకు ప్రత్యక్షంగా ప్రదర్శించడం ద్వారా లైవ్ స్ట్రీమింగ్ వినోద అనుభవాలలో కొత్త ప్రమాణాలను డిస్నీ+ హాట్‌స్టార్ నెలకొల్పడానికి సిద్ధమైంది. గణతంత్ర దినోత్సవం నాడు అహ్మదాబాద్‌లో తమ అతిపెద్ద స్టేడియం ప్రదర్శనకు బ్యాండ్ సిద్ధమవుతున్నందున, ఈ వేదిక అధిక-నాణ్యత అనుభవాలకు అందరికీ చేరువ చేయడం ద్వారా వినోదం యొక్క భవిష్యత్తును పునర్నిర్వచించింది, అభిమానులు దేశవ్యాప్తంగా ప్రతి స్క్రీన్‌పై ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమ అనుభవాలను సొంతం చేసుకోవటానికి వీలు కల్పిస్తుంది.